నవశక్తి

Vol. 1, no. 7

(Jan. 26, 1938)

రాజమండ్రి, 1938

Record no. 682

Navaśakti

Vol. 1, no. 7

(Jan. 26, 1938)

Rājamaṇḍri, 1938

Record no. 682

NAVASAKTI అణా Telugu Weekly

నవశక్తి

కార్మిక కర్షకులారా! ఏకముగండు!!

సాలు చందా ౩-౦-౦ ప్రచురణ: ప్రతిబుధవారం సంపాదకుడు: మద్దూరి అన్నపూర్ణయ్య

సంపుటం ౧ | రాజమండ్రి 26-1-38 | సంచిక [illegible]

కామ్రేడ్ కమలాదేవి



పశ్చిమ గోదావరిజిల్లా రాజకీయ
మహాసభకు ప్రారంభోపన్యాస మిచ్చారు

ప॥ గో॥ యువజన సంఘం

పశ్చిమగోదావరిజిల్లా యువజనసంఘ కార్యనిర్వాహకవర్గ సమావేశము 20—1—38వ తేదీన పాలకొల్లులో యిపటూరి వీరభద్రరావుగారి అధ్యక్షతను సమావేశమై యీక్రింది తీర్మానములను గావించెను.

తీర్మానము

(I) మార్చి 10వ తేదీవరకు ప్రాధమిక సంఘ సభ్యులను చేర్పించుటకునూ మార్చి10వ తేదీలగాయతు 15 వ తేదీవరకు నూతన ప్రాథమిక సంఘ ఎన్నికలు జరుపుటకును యింతకుముందు 3 నెలలక్రితము చేరిన సంఘసభ్యులందరు మరల నూతన సంవత్సరపు సభ్యులుగా చేర్పించ వలసినదని ప్రాధమిక సంఘములను యీ సభవారు హెచ్చరించుచున్నారు.

(II) జిల్లామహాసభను తణుకుతాలూకాలో జరుపుటకు నిశ్చయించుచూ తగినస్థలమును ఏర్పాటుచేయుటకు యిపటూరి వీరభద్రరావుగారిని కోరటమైనది.

(III) జిల్లాసంఘఆఫీసు ఖర్చులకుగాను ప్రతిప్రాధమిక సంఘమునుండి కనీసము 1—0—0 చొ॥ సహాయము చేయవలసినదిగా కోరుచూ తీర్మానించటమైనది. ఇంకా కొన్ని ముఖ్యమైనతీర్మానములు గావించబడెను.

ఇట్లు
కోసూరి సుబ్బన్న
సహాయ కార్యదర్శి
ప॥ గో॥ జి॥ యువజనసంఘం.

విజ్ఞప్తి

బెజవాడలోవుండే మా తాలింఖానా మిత్రులకు ప్రెసువర్కు మిత్రులకు ఫాక్టరీలలో నా కార్మిక మిత్రులకు జట్కాబండ్లుతోలే నా మిత్రులకు మోటారుడ్రయివర్లు సోదర్లుకు యీ అందరు గాక న్యూటన్లుగావుండే స్వాతంత్ర మిత్రులకు మీకుఅందరుకు సంబంధించినదీనుడు మనవి యేమనగా—

యిప్పుడు రాచకీయపోరాటంలో చాలాదీర్ఘాలోచనతోను దివ్యజ్ఞానముతోను చెప్పినంతమాత్రమున తొందరపడి సామాన్యమయిన చూపును సామాన్యమయిన శక్తిని మనమిత్రులమైన వుపయోగించుట మన ముందు మార్గమునకు దారికాదని తోచుచున్నది. మన శక్తిసామర్ధ్యములు అన్నియు మనపౌరషము మన శరీరబలము వుపయోగించుటకు మనకు ముందువున్నది. మనదారికోసము ప్రయత్నముచేసే సోదరుల జాడను ఆగ్రహమును వుపయోగించుట పాటికాదని నా మనవి. మన కష్టము మనమెరగక షుద్బాధచేత లోలోన మగ్గుచున్నట్టి మనదరిద్రుల కష్టములు తీర్చుటకు నేటిరషియా మనకు ఆదర్శమయియుండగా యిట్టి ధనికవర్గమునకు మీరు తోడుపడుట భస్మాసురాస్త్రమునకు పోల్చడమయినది. యిదియే సమయము. మనకు బాగుపడటకు మార్గము. కష్టములు తొలిగిపోవు సమీపించుచున్నది. యిది అంతయు మీచేతులలో యున్నది. భార్యాకి వంటినిండ గుడ్డలేక బిడ్డలకు కడుపునకు కూడులేక ధనికబిడ్డలనుచూచి మనబిడ్డలను యింకెంతకాలం చేతులు చాసింపుతాము. చాలా అవమానకరం. యికనయినను జాగ్రత్తగా మేల్కొనవలెనని నాప్రార్థన.

నేను మీవంటి కూలివాడనే.
తోట నరసయ్య.

పోలీసుల జబర్దస్తీ.

కె. వి. యమ్. రావుబ్రదర్సు.
మోటారుసర్వీసు.
ఏలూరు టు గుడివాడ.

యం. సి. నెం 295 రు గల బస్ మధ్యాహ్నం 1 గం కు గుడివాడ వెళ్ళుటకు ఏలూరుస్టాండులో చక్కింగు చేయుచుండగా తాలూకా సర్కిలుయిన్స్పెక్టరుగారి, రైటరు వచ్చి మాసర్కిలుయిన్స్పెక్టరుగార్కి నాల్గుటిక్కెట్టులు పంపించవలసినది అని చెప్పినాడు. దానికిదాను వకటిక్కెట్టు ఫ్రీగా తీసుకు వెళ్ళుతాను. మిగతా మూడుటిక్కెట్టుల్కి డబ్బు యివ్వవలసినదిగా కండక్టరు అడిగినాడు. పోలీసువారంటే నిర్లక్ష్యభావముగా వున్నదా అని రైటరు గుడ్లుయెర్రజేసి వెళ్ళినాడు. వెళ్ళిన పదినిమిషములకు టవును సబ్‌యిన్స్పెక్టరుగారిని తీసుకునివచ్చినారు. యిన్స్పెక్టరుగారు యెవరోయి కండక్టరూ అని కేక వేసినారు. ఏమని కండక్టరు వచ్చినాడు. సర్కిలుయిన్స్పెక్టరుగారికి నాల్గుటిక్కెట్టులు ఫ్రీగా తీసుకువెళ్ళుటకు వీలులేదు అని చెప్పినావట యెందుకు అని అడిగినారు. ఓనరు పరిమిషన్‌కానిదే నేను యేమిచేయుటకు వీలులేదు అని చెప్పినాడు. నీకు యజమాని ఆర్డరు కావాలా చూడు నిన్ను యేమిచేస్తానో రాస్కల్, నీ లయిసెన్సు క్యాన్సల్ చేయించుతాను. నీయజమానితోచెప్పి నీనవుకరు తీసివేయించుతాను పోలీసువారంటే నీకుయింత నిర్లక్ష్యమా అని నోట్కివాని బండమాటలు అన్ని మాట్లాడి, బండిలో నలుగురిపాసింజర్సును దింపి, సర్కిలుయిన్స్పెక్టరుగారి యింటికి బస్సు తీసుకువెళ్ళి వారితాలూకు నలుగురిని యెక్కించుకువెళ్ళినారు. దీనికి, కండక్టరు సహింపలేక డిస్ట్రిక్టు కలక్టరుగార్కి డిస్ట్రిక్టుసూపర్నెంటుగారికిన్నీ, తెలియపర్చుకున్నాడు.

ఆ పిటీషన్ ఏలూరుటవును సర్కిలుయిన్స్పెక్టరుగార్కి యింక్వయిరునిమిత్తం వచ్చినది. యీనెంబరు డ్రయివరువద్ద స్టేటుమెంటు తీసుకున్నారు. యింకా విచారించుచున్నారు.

మోటారుసోదర్లు అందరికి తెలియజేయడము యేమనగా యిటువంటి దుంతగములు జరిగినపుడుపై అఫీసర్సుకు తెలియజేయడం చాలాఅవుసరం. పేపరుకు తెలియపర్చడముకూడా అవుసరం. యిది శ్రద్ధగా గమనించవలెను అని కోరుచున్నాను.

తోట నరసయ్య

నెల్లూరు జిల్లా ప్రథమ

విద్యార్థి మహాసభ

ఈనెల 29 30. తేదులందు నెల్లూరులో.

అధ్యక్షులు :—

కామ్రేడ్ ఎ. యస్. కె. అయ్యంగారు యం. ఏ.

సభా ప్రారంభకులు :—

కామ్రేడ్ జి. నారాయణరావుగారు బి. ఎ. యల్. టి.

ఆహ్వాన సంఘము.

★ చైనా జపాన్ యుద్ధానికి పూర్వగాథ ★

కమ్యూనిష్టు - కొమిన్‌టాంగ్ భేదాలు: గిల్లి కజ్జాలు పెట్టే జపాను.

[కార్మికవాది]

సామ్రాజ్యవాదుల తృష్ణ

ఇప్పుడు జరుగుచున్న చైనా జపాను యుద్ధమునుగూర్చి తెలిసికొనుటకు యీదేశముయొక్క పూర్వవృత్తాంతము కొంతవరకు తెలిసికొనవలెను.

1917 లో జరిగిన రష్యావిప్లవమునకు పూర్వము, రష్యా ప్రభుత్వమువారు చైనాపై కొంత యధికారము చలాయించి కొన్నిహక్కుల ననుభవించుచుండిరి. కాని రష్యావిప్లవ తదనంతరము స్థాపింపబడిన ప్రభుత్వము సామ్రాజ్యతత్వముపై యాధారపడి యుండలేదు. సామ్రాజ్యతత్వమునకు పూర్తిగా వ్యతిరేకమగు కమ్యూనిష్టు సిద్ధాంతములపై యాధారపడి యుండెను. అందువల్ల రష్యాలోని సోవియటు ప్రభుత్వమువారు తత్పూర్వ మా దేశప్రభుత్వము చైనాపై చలాయించుచుండిన యధికారమును త్యజించిరి. వారి యొక్క చర్య చైనాదేశపు ప్రజలలో సంతృప్తి కలుగజేసెను. అటువెనుక 1920 మే నెలలో చైనా దేశములో కమ్యూనిష్టుపార్టీ నెలకొల్పబడెను. యీ కమ్యూనిష్టు పార్టీవారి ముఖ్యోద్దేశములలో నొకటి, సామ్రాజ్య తత్వమును ఎదుర్చుట. చైనాదేశము నామమాత్రముగా స్వతంత్రదేశముగా వ్యవహరింపబడినను, యీదేశము, సామ్రాజ్య తత్వదేశములగు యింగ్లాండు, అమెరికా, జపాను జర్మనీయొక్క యనుకూలతకు పూర్తిగ యుపయోగింప బడుచుండెను. వారికి చైనాతో వ్యాపారము చేయుటకును, యీవ్యాపారమునకు తగిన వసతులు కల్పింప జేయుటకును, పూర్తిగ యధికారముకల్గి యుండిరి. దేశములో ఆంతరంగిక రాజకీయములలో గూడ యీదేశములవారు పూర్తిగ జోక్యము కలుగజేసికొనుచుండిరి. అట్లు జోక్యము కలుగజేసికొనుటకు కారణము, యీ యీ దేశములవారి వ్యాపారము సంరక్షించుకొనుటయే యని వారు దెల్పుచుండిరి. ఇక యీ సామ్రాజ్య దేశములవారు చైనాలో హెచ్చుగా పెట్టుబడి పెట్టియున్నారు. రైల్వేలలోను, బ్యాంకులలోను, కొన్ని ఫ్యాక్టరీలలోను, వారి పెట్టుబడి హెచ్చుగా యున్నది. యీ పెట్టుబడిని రక్షించుటకు, యీయీ దేశములవారు, చైనాయొక్క రాజకీయములలో జోక్యముకల్గించుకొనుచు, చైనాయొక్క యార్థికగతిని, తమ వ్యాపారమున కనుకూలించునట్లు నడుపుచుండిరి. యీ నిరోధకవిధానము యొక్క ఫలితముగా చైనాయొక్క యార్థిక పరిస్థితులు దినదినక్షీణతను బొందుచుండెను. యీవిధముగ యార్థికనిరోధమును తొలగించి, యార్థికాభివృద్ధికి పాటుపడవలెననిన మొదట యీసామ్రాజ్యదేశముల యధికారమును చైనాదేశములో నిర్మూలింప జేయవలెనని యీ కమ్యూనిష్టు పార్టీ తెలసి

కమ్యూనిష్టుల పలుకుబడి

కొనినది. యీ సామ్రాజ్యతత్వము నెదుర్కొనుటకును, తమయాదర్శమును నెరవేర్చుటకును, చైనాలో కొమింటాంగు యను రాజకీయసంస్థతో చేరి తమ పోరాటమును సాగించుటకు 1922 జూన్‌లో జరిగిన రెండవ కాంగ్రెసులో చైనా కమ్యూనిష్టు పార్టీవారు తీర్మానించిరి. కొమింటాంగ్ యను సంస్థ మన దేశములోని నేషనల్ కాంగ్రెసువంటి జాతీయసంస్థ. యీజాతీయాశయములుగల కొమింటాంగులో కమ్యూనిష్టులు పనిజేయుటకు, కొమింటాంగ్ కాంగ్రెస్‌వారు 1924 లో వప్పుకొనిరి. అప్పటినుండియు కమ్యూనిష్టులు కొమింటాంగులో పనిచేసిరి. వారిపలుకుబడి హెచ్చెను. కొమింటాంగులో నుండు మితవాదులకు వీరి పలుకుబడి హెచ్చగుట, చాల యాందోళన కల్గించెను. యిది యిట్లుండ, హూనన్, హూఫే, రాజధానులలో జాతీయప్రభుత్వములు స్థాపింపబడినవి. ఆప్రభుత్వములలో కమ్యూనిష్టుల పలుకుబడి హెచ్చుగా యుండెను. కమ్యూనిష్టుల పలుకుబడి హెచ్చగుట జూచి నాంకింగ్‌లో నిర్మింపబడిన జాతీయ ప్రభుత్వపు నౌకర్లనుండియు సైన్యమునుండియు, కమ్యూనిష్టులను బాగదోల నిర్ణయించిరి. యిది యిట్లుండ, వూహానులో జరిగిన కొమింటాంగు, కార్య నిర్వాహక వర్గము వారు, 1927 జులైలో కమ్యూనిష్టులను కొమింటాంగునుండి బాగదోల నిర్ణయించిరి. అప్పటినుండియు కొమింటాంగువారు నాంకింగులోని జాతీయప్రభుత్వమునే కేంద్ర ప్రభుత్వముగా వప్పుకొనిరి.

కమ్యూనిష్టులను చిత్రవధ చేయుట

ఇప్పటినుండియు కమ్యూనిష్టులపై నాంకింగు ప్రభుత్వమువారి తీవ్రచర్యలు ప్రారంభమయ్యెను. యీవిధానము చైనాదేశములోని పెద్దపెట్టుబడిదార్లయొక్క యాశయములు, చైనాలోని విదేశబ్యాంకుల యాశయములును, సామ్రాజ్య ప్రభుత్వముల దోపిడీయాశయముల రక్షించుటకై యేర్పడినది. యీ చర్యల తీవ్రతయు క్రూరతయు చాల హెచ్చుగా యుండెను. కేవలము కమ్యూనిష్టులే గాదు రైతు సంఘముల వారును, విద్యార్థిసంఘములవారును. సామ్రాజ్యతత్వము నెదుర్చుదురని యనుమానింపబడిన ప్రతివారును హింసింపబడిరి. చాలమందిని యీ నూతన విధానములో చంపివేసిరి.

కాని చైనాదేశములో బీదరికము చాల ఘోరరూపములు దాల్చినది. రైతులలో నిరుద్యోగ్యము మెండుగా యుండెను. వారు తినుటకు తిండిలేక మలమమాడుచు తీవ్రములగు జాడ్యములకు గురియై, కాటకము లనుభవించుచుండిరి. యిట్టివారు. పొట్టకు తిండియు కట్టుటకు గుడ్డయు, నిలువనీడయు, కల్గియుండవలెననిన, కమ్యూనిష్టుపద్ధతి తప్ప వేరొకపద్ధతి వారి కాచరణీయముగా దోచలేదు. అందువలననే వారు నాంకింగు యొక్క ఘోర నిర్బంధ విధాన మెట్లుండినను వారల దుస్థితిని బారదోలునట్టి కమ్యూనిష్టుపార్టీనే, బలపరుప మొదలిడిరి.

సోవియట్ చైనా నిర్మాణము

యీ కమ్యూనిష్టుపార్టీ యొక్క బలము క్రమముగా హెచ్చుచుండెను. వీరు ఫాక్టరీలలోను, గ్రామములలోను వారి కేంద్ర స్థానములను నిర్మించిరి. వీరిపై ప్రయోగింపబడిన, తీవ్రవిధానములను నిరోధించుటకై వలయు యాయుధములను సంగ్రహించి క్రమముగా వారి కమ్యూనిష్టునిర్మాణమును బలపరచుచుండిరి. యిట్లు విప్లవ నిర్మాణములను బలపరచుకొని, 1927 నవంబరు 7 వ తేదీన కాంటనువద్ద హైలాంగ్, లోఫాంగ్ యను గ్రామములలో ప్రథమ చైనా సోవియటు స్థానిక ప్రభుత్వమును నెలకొల్పిరి. యిదియైనవెనుక 1927, డిసెంబరు 11వ తేదీన, కాంటను పట్టణములో విప్లవము జరిగెను. 34,000 మంది రాజకీయఖైదీలు విడుదల కాబడిరి. వారెల్లరును యీ విప్లవకారులతో కలసి పోరాడిరి. కార్మికులు పట్టణమంతను వశముచేసికొనిరి. యిది జరిగిన మూడురోజులకే కాంటను రక్తప్రవాహములతో ముంచివేయబడెను. యీ విప్లవకారుల కెదుర్చువారు హెచ్చుబలము కల్గియుండిరి. ముందు ప్రథమ సోవియటు స్థానికప్రభుత్వములు నిర్మింపబడిన గ్రామములనుండి విప్లవకారులకు సమయమునకు సహాయము రాలేదు. యింగ్లీషు వర్తక నౌకలు కొమింటాంగు సైనికులను త్వరితముగా కాంటనుకు చేర్చిరి. యీవిధముగనే యింగ్లీషు యుద్ధనౌకలును అమెరికా యుద్ధనౌకలును జపాను యుద్ధనౌకలును, యీవిప్లవము నణగద్రొక్కుటకు తీవ్రముగా సహాయపడినవి. విప్లవము అణగద్రొక్కబడెను. కాని దీనివలన విప్లవముయంతరింపలేదు. విప్లవకారుల యాశయములును అంతరింపలేదు. వీరి ప్రణాళికయు గొప్ప యాందోళన చైనాలో కలుగజేసెను. యీప్రణాళికయే సోవియటు చైనాయొక్క ప్రణాళికయని, కార్మిక కర్షకసంఘములలో వ్యవహరింప బడజొచ్చెను.

యీ కాంటను విప్లవానంతరము, కమ్యూనిష్టు పటాలము కియాంగ్‌సీ హూనాన్ సరిహద్దులలో 1928 ప్రారంభమున, 7 పరగణాలలో సోవియట్ రాజ్యము స్థాపించిరి ఇచ్చట సోవియటు ప్రభుత్వమువారి యాజమాన్యమున. సైన్యమును తర్ఫీదు చేయుట కొక కార్యాలయమును, యుద్ధసామగ్రిని తయారుచేయు కర్మాగారమును, ఆసుపత్రులును, స్థాపించి, యిప్పుడు వ్యవహరింపబడు చైనా రెడ్ఆర్మీ (చైనా కమ్యూనిష్టు పటాలము) ను తర్ఫీదుచేయ మొదలిడిరి. 1930 సంవత్సరమునకు, యీసోవియటు ప్రభుత్వము పది పరగణాలలో యుండెను. యీ ప్రభుత్వము క్రింద వకలక్షమంది పై చెప్పబడిన తర్ఫీదైన సైనికులుండిరి. 1930 లో హూనాన్ పరగణాయొక్క ముఖ్య పట్టణమగు చాంగ్‌షా నగరమును యీ సోవియటు ప్రభుత్వము వారాక్రమించుకొనిరి. కాని చైనాలో చాలమంది సామ్రాజ్య దేశములు వివిధములగు హక్కుల ననుభవించుచుండిరని మనము తెలిసికొంటిమి. కాన, యీ చాంగ్‌షా నగరము చైనా కమ్యూనిష్టులాక్రమించుకొనుటచే విదేశ సామ్రాజ్య దేశముల హక్కులభంగము వచ్చునను కారణమున యిటలీ, ఫ్రెంచి, అమెరికా, యింగ్లీషు యుద్ధసైనికులును, కొమింటాంగు సైనికులును కలసి యీ కమ్యూనిష్టులను చాంగ్‌షా నగరమునుండి తరిమివేసిరి. కమ్యూనిష్టు సైన్యము, చాంగ్‌షా నగరమును విడిచిపోయిన

(తరువాయి 11 వ పేజీలో)

ఆదర్శ జ్యోతి

కథ ★

శ్రీ పి. రంగా రెడ్డి

ఉదయము 7½ గంటలు. లీల తల దువ్వుకొని జడ వేసుకుంది. అద్దం ముందు నిలుచుని స్నో బొటిలు తెరుస్తుంది. అద్దంలో ఎదురుగాయున్న పటములోని యువకుని వికసిత ముఖము మాత్రం కనబడుతుంది. లీల ఆలోచనా నిమగ్నురాలైంది. దాసి కాఫీతెచ్చి మేజాపైబెట్టి నాన్నగారు ఆఫీసు గదిలో యుండి త్వరగా రమ్మన్నారంది. లీల తిరిగి చూచింది. దాసి వెళ్ళిపోయింది.

లీల చేతిరుమాలుతో ముఖము దిద్దుకుంటూవచ్చి, ప్రక్కపై రాత్రి చదివిపెట్టిన "అమ్మ" ను తీసి అందులోని ఫోటోను చూస్తు పావెల్, శశాంక, నటాష, నకోచ, జీవితాలను జ్ఞాపకము తెచ్చుకుంది. కాఫీ త్రాగుతూ కన్నీళ్ళు రాల్చింది. లీల దుఃఖానికి కారణ మేమో ? ఇంతలో నాన్నగారి కేక వినబడ్డది.

★

సూరిశాస్త్రులు:—(చేతులూపుతు) బహు చక్కటి సంబంధం. ఈ నెలలో మంచి ముహూర్తా లున్నవి.

కుటుంబరావు:—(ఈజీచైరులో పడుండి) మా లీల అదృష్టము.

(ఇంతలో లీల వెళ్ళి ప్రక్కనున్న పేము కుర్చీలో ఆసీనురాలవును)

రావు:—లీలా ! శాస్త్రులుగారు చక్కటి సంబంధం కుదిరించారు. హైకోర్టు జడ్జీగారి కుమారుడు మోహనరావు ఐ. సి. యస్. చదివి వచ్చాడు. త్వరలో పెద్ద ఉద్యోగము దొరుకుతుంది. ఈనెలలోనే మంచి ముహూర్తము లున్నవట. వివాహము నిశ్చయించాము.

లీల:—నాన్నా ! ఆ వివాహము నాకక్కరలేదు. ప్రతి మానవునకు స్వేచ్ఛ అంటూ ఉండాలి. నేటి దుష్ట సంఘములోయుండు అనర్థాలను బాపి, ఆదర్శ జీవి కావటము ప్రతియువతీ యువకుని ధర్మం. ఐ. సి. యస్. చదివినాడని, ధనవంతులని నా ఆదర్శాలను మరచి నా దేశానికి ద్రోహమొనర్పను. ఒక వ్యక్తికి నన్ను బానినను చేయకుము. ధనమున్కై నా జీవితమును అమ్మబోకు.

రావు:—(కళ్ళు ఉరిమి) ఓహో ! శృతిమించి రాగానబడ్డదే. దేశాన్ని ఉద్ధరిస్తావు. బాగుంది తల్లీ తండ్రీ లేకుండ బజారున పడతావటే. ఎందుకైనా మంచిదని అడిగాము. ఇదా జవాబు. స్త్రీలకు స్వాతంత్ర్యమా ? అంటూ బొజ్జ నిమురుకుంటూ రావు వెళ్లాడు.

శాస్త్రి:—అమ్మాయి. ఇటు చూడు. ఎందుకైనా మంచి సంబంధం. నాన్నగారి మాట విను. మోహనరావు మన్మధునిలా....

"ఛీ ! వెధవా ! ఇప్పటికెంతమంది యువతుల జీవితముల దుఃఖభాజన మొనర్చితివి. ధనమునకు యువతులనమ్ము దళారీలా మీరు ! స్త్రీలు అమ్ముడు సరకా ! మానవ హంతకులకు, మీకు భేదమేమున్నది. గొఱ్ఱెల గోయు కటికివారు మీకన్న మెఱుగు. మానవజీవితములను మంటగలుపు కింకరులు మీరు" అంటు లీల వెళ్ళిపోయింది.

కొయ్యబొమ్మలా తయారైన శాస్త్రులు పంచాంగం కట్ట చంకలోబెట్టి, నశ్యంబుర్ర బొడ్లో దోపుకుంటూ యుంటే, రావు ప్రత్యక్షం.

శాస్త్రి:— చూచావా ! ఈ యింగ్లీషు చదువుల మహిమ. ఇప్పుడే మూతి విరుపులకు, ముక్కుపోట్లకు వస్తుంటె, యింకా స్త్రీలకు స్వాతంత్ర్య మిచ్చి పురుషులు గాజులు దొడుక్కోవాలా ? అందరూ మాలముండల్లాగ దొరసాన్లవుతున్నారు.

రావు:—అసలు కావదావిల్లు తెచ్చిం దీచేటు. చిన్నప్పుడే తాళి గడితే. మీరు దయయుంచి కట్నం మాట....

శాస్త్రి:— అదేమి వరవాలేదు. కర్చులకేమైనా....

రావుజేబులోనుంచి పదిరూపాయలనోటుతీసియిచ్చాడు శాస్త్రి నమస్కారాలతో నిష్క్రమించాడు.

★

అంతా నిశ్శబ్దంగా ఉంది. గాలిమాత్రం హోయన వీస్తుంది లీలకు నిద్ర పట్టలేదు. గాలికి ఎగురుచున్న కురులను సర్దుకుంది. ఏదో తదేకధ్యానంగా ఆలోచిస్తున్నట్లుంది. ప్రక్కనున్న గోడగడియారము టంగ్ టంగ్ మని పది గొట్టింది. లీల ఎందుకో ఒక నిట్టూర్పు విడచింది. బొమ్మపై నున్న "అమ్మ" ను తీసి పేసి గుర్తుపెట్టి. ప్రక్కనున్న మేజాపై బెట్టింది. ఈజిచైరులోనుంచి లేచి, లైటుతగ్గించి ప్రక్కనేఉన్న పాన్పుపై మెల్లిగా మేను వాల్చింది. కాని కళ్లమాత్రం విద్యుద్దీపాలులా మెరుస్తునేఉన్నవి. సినిమానుంచి వెళ్ళుచున్నారు గావచ్చు. ఎవరో రోడ్డుపైన బిగ్గరగా "ఆయువతీ యువకులప్రేమ అవశ్యమైనది" అంటూ ఏదో ఈమాటలు లీలచెవున బడ్డవి. కళ్ళు మూసుకుంది. హృదయము దడదడలాడింది. నిట్టూర్పు విడచింది. మెల్లిగా లేచి పుస్తకములోని ఫోటోను తీసుకుంది. కళ్లార చూచింది; ఓసారి హృదయాని కద్దుకుంది. ప్రక్కపై పండుకొని, ప్రతిమను చూస్తు ఆలోచనా సాగరమున తేలుతుంది లీల.

ఆఫోటోవైపు కన్నార్పకుండ చూచుచున్నది. ఏల ఎందులకు ? దివ్యసుందర విగ్రహమా ? కాదే. వికార విగ్రహమే. ఎవరిదైయుండును. లీల హృదయములో కావెట్లు దొరికెను ?

అనాటి కాలేజిదినాలు జ్ఞాపకాని కొచ్చాయి. తాను ప్రభాకర్ యిసుకతిన్నెలపై సామ్యవాద సిద్ధాంతాలను చర్చించుకున్నారు. రష్యాలో విప్లవోద్యమము పీడిత వర్గాల ఏవిధంగా ఉద్ధరించింది చదివినారు. రష్యాలో యువతీ యువకుల ఆదర్శలీలలు స్ఫురణకు వచ్చాయి లీలకు. అదిగో, అనాడే ఒండొరుల ఆదర్శాలకు లీనమైపొయ్యారు. సౌందర్యాన్ని ప్రేమించ లేదు. ధనాన్ని కొలువలేదు. మరి దేనిని ? ప్రియుని ఆదర్శాలను. కష్టజీవుల సేవ. పీడితవిధానాన్ని రూపుమాపుట. దుష్టసంఘపు పునర్నిర్మాణము. ఇరువురి ఆదర్శాలు ఏకము. దాంతో హృదయాలు కలిసినవి. తమ జీవితాల అర్పించటానికి ప్రతిజ్ఞ జేసుకున్నారు కార్మిక కర్షకసేవకు. చేతిలోని ఫోటో హృదయంపై వాలింది. లీల కళ్ళు మూసుకుంది.

ఎవరిది ఆఫోటో ? నిరుద్యోగముతో పీడింపబడి, తిననికి తిండి లేక, కడకు ఫ్యాక్టరీకూలీగా చేరి కార్మికసేవ జేయుచుంటే, యజమాని ఆగ్రహానికి గురియై, వెడలుగొట్టబడిన ప్రభాకరునిది. ఎక్కడనున్నది, కుటుంబరావు బ్యాంకరుగారి కూతురు, దివ్యసుందరి లీలహృదయముపై ఎటుల రాగలిగినది. ఒండొరుల విప్లవ ఆదర్శాలు.

వివాహ ప్రయత్నములు చురుకుగా జరుగుచున్నవి. ఇక నాలుగుదినములున్నది ముహూర్తము. బంధువులంతా దిగుతున్నారు. రోజులు దగ్గరవచ్చే కొలది బంధువర్గం ఎక్కువైంది. లీలతో ఎప్పుడూ ఎవరో మాటాడుతునే ఉండేవారు. ఎడతెరిపి లేదు. లీల హృదయము మాత్రము వేరొకచోట లీనమైనది. పాపం లీల ఏమిచేయగలదు. దుష్టసంఘము. స్వేచ్ఛాప్రేమకు తావులేదు. స్వాతంత్ర్య మనుమాటకు నేటి సంఘములో తావులేదు.

గదిలోకి వెళ్ళింది. టేబిల్ తెరచి, కలము కాగితము తీసి ఏదోవ్రాసింది. కవరులో పెట్టి చిరునామ వ్రాసింది. చిరునామవైపు మరి మరి చూచింది. మెల్లిగా పెట్టె దగ్గరలోనే ఉన్న తపాలు పెట్టెలో వేసింది.

తెల్లవారి ముహూర్తము. లీలగదిలో ఒంటరిగా అటూ యిటూ తిరుగుతూంది. టేబిల్ తెరచి మరల వేసింది. ఏదో వెదకుతున్నట్లుంది. పుస్తకాలన్నీ సర్దుకుంది. దీర్ఘంగా ఆలోచించింది. హృదయమును నిశ్చయపరచుకుంది. ప్రయాణమునకు సంసిద్ధురాలైనది. దిక్కుతెలియక అటూ యిటూ పచారుచేస్తు, ఎందుకో తలుపుతెరచి నాన్నగదివైపు వెళ్లింది. గదిలో మాతాపితలు దీర్ఘనిద్రలో యున్నారు. లీల కన్నార్పకుండ చూచింది. బొట బొట కన్నీళ్లు రాల్చింది. చేతులు జోడించి నమస్కరించింది. మెల్లగా తిరిగి గదిలోకి వచ్చి తలుపు మూసుకుంది. అంతా నిశ్శబ్దము. ప్రపంచమంతా అంధకారము లాగున్నది. ఈజీచైరులో కూర్చొని కన్నీళ్ళు రాల్చింది. ఏదో మహాతప్పు జేస్తున్నాను అనుకుంది. తన్ను తాను నిందించుకుంది. ఓనిట్టూర్పు విడచింది. ప్రభాకరుని ఫోటో తీసి చూచి దృఢనిశ్చయురాలైంది. కలము తీసుకొని ఏదో దీర్ఘంగా వ్రాసింది. మేజాపైపెట్టి, కన్నీళ్లురాల్చి, కడసారి వందనాలర్పించింది.

ఒకచేత పుస్తకాలమూట, రెండేచేత మరోచిన్న పెట్టె. మెల్లిగా గుమ్మందాటి బయటకొచ్చింది లీల. చల్లటిగాలి. అమితమైనచలి. శరీరము చిల్లులు అయ్యేలా వుంది. తలపై పెట్టె మూటనిడుకొని వేవేగంగా పోతోంది లీల. మధ్య మధ్య ఎందుకో తిరిగి చూచి, నిట్టూర్పు విడిచింది. స్టేషను చేరుకుంది.

స్త్రీలపెట్టెలో ఎక్కి ఓమూల గూర్చుంది. ఎందుకో రైలు కదులుతుంటే, కిటికీలోంచి చేతులుజోడించి, ఏదో గొణుగుకుంది. రైలు శరవేగమున పోతూంది. చల్లటిగాలికి కునుకుపట్టింది. కునుకులో సంతోషం, దుఃఖము అన్నీ. రైలు 6 గంటలకు బెజవాడ చేరింది. బండి ఆగింది. ప్లాటుఫారముపై కోలాహలము లీలను మేల్కొలిపింది. తలసర్దుకొని కిటికీలోంచి చూడాలని కావచ్చు తలముందుకుపెట్టింది.

(13 వ పేజీ చూడుడు)

దేవుళ్ళ పుట్టుపూర్వోత్తరాలు ★

శ్రీ మహాంకాళి శ్రీరామమూర్తి.

మానవుడు గొప్ప సాంప్రదాయం గల జంతువు. ఇది నిర్వివాదాంశం. ఈవిషయంలో ఎవరికీ ఏవిధమైన అనుమానాలూ ఉండటానికి తావులేదని నానమ్మకం. ఇతడికి ఈగొప్ప సాంప్రదాయం ఎట్లా వచ్చిందీ: బుర్రగలవాడూ, ఆలోచనాపరుడూ గనక- మిగతా పశు పక్షి కీటకాదులమల్లేగాక ఇతగాడు ప్రతివిషయం ఆలోచిస్తాడు- ఇది ఇట్లా ఎందుకు వుండాలీ: అది అట్లాఎందుకు వుండాలీ: అని తర్కిస్తాడు. ఏది ఎట్లా వుంటే సత్యమో ఊహిస్తాడు. అది అట్లాచేయడానికి ప్రయత్నిస్తాడు- కనీసం అట్లాచేయవలసిన బాధ్యత అతడిపైన వుంది. ప్రపంచాన్ని నానాటికీ అభివృద్ధికి తీసుకువచ్చే బాధ్యత అతడిపైనే వుంది- ఆబాధ్యతను త్రోసివేయడానికి అతడికి అధికారంలేదు- కారణం: మిగతా జంతువులకన్న అతడు ఘనుడు గనక, ఆలోచనాపరుడు గనక- ప్రపంచాన్ని ఎక్కువగా ఉపయోగించుకొనే వాడతనేగనక.

ఈవిషయంగుర్తించి మానవుడు కార్యసాధనకు పూనుకొన్నాడు. తన మేధకు పనికల్పించాడు. ప్రకృతి రహస్యాలు ఊహించడం మొదలుపెట్టాడు. వాయువు, అగ్ని, నీరు, మంచు, మట్టి, లోహాలు, మొదలైనవాటిని పరిశోధించాడు - పరిశీలించాడు. తనజీవితానికి కావలసిన పరికరాలు సంపాదించాడు. కొన్ని కొన్ని విషయాలు తెలుసుకొనేందుకు విశేషం పరిశోధన సాగించాడు. తనఅనుభవాలు, పరిశోధనాఫలితాలు శాస్త్రాల రూపంగా ప్రపంచానికి అందజేశాడు. వాటి ఫలితంగా విజ్ఞాననిలయాలు, విజ్ఞానాన్నిచ్చే గ్రంథాలూ-వాటిని చదివి, అవగాహన చేసుకుని, నిర్వచించి, లోపాలు తీసి సవరణచేసే పండితులు బయలుదేరారు. వీరు సాధారణ జనానికి తమ శాస్త్రానుభవాలనూ, విజ్ఞానాన్ని అందజేయడం ప్రారంభించారు- యాతావాతా సాధారణ జనమంతా అంటే మాసెస్- ఈ పండితులు చెప్పినదాన్నే పరమార్థంగానూ, పరమావధిగానూ భావించడం ప్రారంభించారు- విశేషించి, అంతటివిజ్ఞాన సంపన్నులైన పండితులను పూజించడం ప్రేమించడం, వాళ్ళకు తాము లొంగి, భయభక్తివినయాలతో ప్రవర్తించడం, వారిని గురువులుగానూ దైవజ్ఞులుగానూ భావించి ప్రార్థించడం ప్రారంభించారు. అప్పటికప్పుడే ప్రపంచం రెండు వర్గాలైపోయింది- పండితులు, పామరులు- వీరిలోనే తిరిగి రెండువర్గాలు బయలుదేరినై- ధనికవర్గం, బీదవర్గం.

మానవుడు తనజీవితానికి కావలసిన పదార్థాలు సంపాదించడం మొదలుపెట్టాడు. తనవద్దలేని పదార్థాలు తనవద్దనున్న పదార్థాలు ఇచ్చి కొనుక్కోవడం ప్రారంభించాడు. ఈవిధంగా ప్రతిజీవి తన జీవిత యాత్రకు కావలసిన సామగ్రిని సేకరించుకోవడంసాగించాడు. కొందరు తమ బుద్ధికుశలతను ఉపయోగించి తమకు కావలసిన వాటికన్న ఎక్కువ పదార్థాలు సంపాదించుకొన్నారు. కొందరు సాధారణజీవులు కొద్దిగా సంపాదించుకోగలిగారు. కొందరు బలహీనులు అసలు ఏమీ సంపాదించుకోలేక పోయారు. ఈపరిస్థితులలో ఒక ఘర్షణ సంఘటిల్లింది. పదార్థాలు ఏమీ సంపాదించుకోని వాళ్ల జీవితంగడపటం ఎలాగా అనే మీమాంస బయలుదేరింది. ఈ మీమాంసతో బాగా సంపాదించుకొన్న వాళ్ళంతా భయపడి, ఒకపన్నాగం పన్నారు. ఆ పన్నాగం ఫలించడానికే కొంతమంది పండితులను వాళ్ళందరికి తీసుకొని, వాళ్ళను మస్తుగా మేపి, వాళ్ళచేత ఏమీ సంపాదించుకోని బీదవాళ్ళతో "మీఖర్మ మింతే: భగవంతుడు మిమ్మల్ని ఈస్థితిలో వుండమన్నాడు" అని చెప్పించారు.

పూర్వజన్మంలో ఏదోపాపం చేసుకొన్నాం కాబోలునని ఆబీదవాళ్ళు అనుకుని జీవితం సాగించుకొనేందుకై దాస్యానికి సిద్ధపడ్డారు. తమపన్నాగం ఫలించిందని సంతోషిస్తూ ధనికవర్గాల వారంతా బీదవర్గాల వారిచేత తమపనులన్నీ చేయించుకొంటూ వారి భక్తికి తృణమో పణమో ఇచ్చి "సంతృప్తి" పరుస్తూ వుండేవారు. ఇంకాకొంచెం జాగ్రత్తకోసమై "దొంగతనం చేయరాదు" "బ్రాహ్మణులను పండితులను పూజించాలి" "యజమానియెడల భక్తిగా ప్రవర్తించాలి" ఇల్లాంటి అపభ్రంశపు అడ్డాలు, పరదాలు పెట్టారు.

ఆవిధంగా పాటుపడే వర్గాలవారంతా కార్మికులు, కర్షకులు, బానిసలు, దాసీలుగానూ తయారయ్యారు, ఆస్తిగలవాళ్ళంతా జమీందార్లు, మహారాజులూ, వడ్డీవ్యాపారులగానూ తయారయ్యారు. ఓ మాదిరి డబ్బు గలవాళ్ళంతా మధ్యతరగతిలో జేరారు- వాళ్ళు స్కూలుమేస్టర్లుగానూ, గుమాస్తాలుగానూ, ఉద్యోగస్తులుగానూ ఉన్నారు.

నానాటికి ఈవర్గాలూ వాటిచిహ్నాలూ, పెరిగిపోయినై, డబ్బుగలవర్గం తమహోదాను స్థిరపరుచుకొనేందుకూ రక్షించుకొనేందుకూ సైన్యాలూ, బంట్రోతులు, మొదలైనవి ఏర్పాటుచేసుకొంది. ఇది ఇట్లా వుండగా డబ్బుగల వాళ్ళలోనే వాళ్ళలోవాళ్ళకు, ఈర్ష్య, అసూయత గలిగి ఒకరిపైన ఒకరు యుద్ధాలు చేయడం, వాడిఆస్తి వీడు వీడిఆస్తి వాడు లాగుకోవడం మొదలైన పెనుగులాటలు బయలుదేరినై. ఆపెనుగులాటలో బీదవర్గంవారంతా తమతమ యజమానులరక్షణకై పోరాటం చేయవలసిన పరిస్థితులుకూడ ఏర్పడుతూవుండడం సహజమైపోయింది.

రాను రాను ఈఇరవైయో శతాబ్దం నాటికి ఈవర్గ చైతన్యం మరీ ప్రబలిపోయింది. నేడు అన్నిదేశాలలోను—ఒక్క రష్యాలో తప్ప—కార్మిక కర్షకుల దుస్థితి మనమంతా చూస్తూన్నదే-పత్రికలలోచదువుతూన్నదే. నేటి పెట్టుబడిదారీ వర్గాలూ ధనికవర్గాలూ బీదవర్గాలపైనా యిదివరలో ఎన్నడు చూపని కాఠిన్యత చూపిస్తూవున్నాయి—దీనికంతా కారణం బీద వర్గాలవారంతా తమ స్థితి తాము గుర్తించుకోవడమే-ఆ స్థితిలోనుంచి పైకిరావడానికి చేసే ప్రయత్నాలే-

బీదవర్గాలవారంతా ఈనాటికి తమకు గల్గిన ఆపత్తు మోసం గుర్తించుకో గలుగుతున్నారు. ఇప్పుడు ఆ వర్గాలలో ఒక నవచైతన్యం, ఒక నవశక్తి విజృంభించుతోంది—ఆ నవ చైతన్యమే ఆ నవశక్తే ప్రపంచాన్ని ముందుకునడిపించేది-ఈనవ చైతన్యాన్ని బాగా ప్రజలలోవ్యాప్తి చేయడానికై, పాటుబడి జీవించే వారందరిలోనూ ఉద్బోధించడానికై కొంతమంది విజ్ఞానవంతులైన యువకులు ముందుకు వచ్చారు-వస్తున్నారు. వీరి విజ్ఞానం పూర్వపు పండితుల "విజ్ఞానం" వంటిది గాదు. ఇందులో మోసం లేదు—మాయలేదు—మంత్రం లేదు—తల్లకిందులైన ప్రపంచాన్ని పునరుద్ధరింపజేసే విజ్ఞానం వీరు చేతబట్టుకొన్నారు. ఆ విజ్ఞానం నేటి ప్రపంచానికి ఒక నూత్న కళను ఇచ్చింది. ఆ నూత్న కళముందు కొన్ని కొన్ని మూఢనమ్మకాలు మంచు విడినట్లు విడిపోతున్నాయి—కొన్ని అబద్ధాలు నిజాలుగా మారుతున్నాయి—కొన్ని "నిజాలు" అబద్ధాలుగా అసందర్భాలుగా పరిణమిస్తున్నాయి — కొంత పాత మురికి పోతోంది—కొంత నూత్న కాంతి వెలువడుతూంది—ఆ నూత్నకాంతిలో చూస్తే పాత సమస్యలు, పాతచిక్కులు కొన్ని విడిపోతాయి. అనేక యుగాల నుంచి ప్రపంచాన్ని అలజడి చేస్తూవుండే కొన్నికొన్ని మీమాంసలు అతిసులువుగా పరిష్కారం అవుతాయి.

ఆధ్యాత్మిక వాదానికి భౌతిక వాదానికి పోరాటం ప్రపంచంతో ఆరంభమయింది. ఆధ్యాత్మిక వాదం ప్రకారం దేవుడనే ఆసామీ ఒకడున్నాడనీ అతగాడు అనేక రూపాలతో అనేక అవతారాలతో జగత్తునంతనూ వ్యాపించి వుంటాడనీ ఒక ఉద్దేశ్యం, భౌతిక వాదం ప్రకారం అదేమీ లేదనీ అదంతా వట్టి భ్రమ అనీ మరొక ఉద్దేశ్యం — ఈ రెండు మతాల మధ్యనూ పడి మానవుడు ప్రపంచం ప్రారంభించిన నాటినుంచి కొట్టుకొంటున్నాడు. సాధారణ జనానికి ఇందులో ఏది నిజమో ఏది అబద్ధమో తెలుసుకొనే విమర్శనాశక్తి లేదు. పండితులు గొప్ప విమర్శనాశక్తివుండి. గొప్ప పరిశోధన చేసివుండి కూడా ఏవాదన మానవ ప్రపంచానికి శ్రేయమో చెప్పలేని విచారకరమైన స్థితిలో వున్నారు. సర్ జేమ్సుజీన్సు వంటి శాస్త్రజ్ఞులు ఈ రెంటికీకూడా 'రాజీ' చేయవచ్చునని స్పిరిట్సుతో మాట్లాడ్డం నేర్చుకున్నారు. ఇది మరీ విపరీతమని నావుద్దేశ్యం. ఈ విషయాల్లో శాస్త్రీయంగా ఎవరికి వారు ఊహించుకొంటే చక్కటి దోవ దొరుకుతుందని నా అభిప్రాయం. కాని మనం ఎవరికి వారు ఊహించుకొనే పరిస్థితులలో లేము—ఎవడో "పెద్దవాడు" చెప్పిన పద్ధతినేగాని మనం అవలంబించడం—మానవుడు ఇంకా స్కూలు పిల్లకాయ తరహాలోనే వున్నాడు—ఇటువంటి సమస్యలు బయలుదేరినప్పుడు తమ విజ్ఞానమంతా 'కోల్డ్ స్టోరేజ్' లో తాళంవేసి భగవద్గీతలు తీసి తణిఖీకి ప్రారంభించే పెద్దలు మనలో చాలామంది వున్నారు, వారు డార్విన్‌ను నమ్ముతారు, హెజల్‌నూ నమ్ముతారు, సర్, జేమ్సు

(మిగతా 12 వ పేజీలో)

మంత్రులా : ★ మన కర్తవ్యం

[న్యూ ఏజ్ లో "ఆర్. డి. బి."]

1. ఉద్యోగ స్వీకారముపై వచ్చిన వివాదమంతా జాతీయ ఉద్యమంలో వున్న రెండు పంథాలకు, మన స్తత్వాలకు అనగా సంస్కరణ, విప్లవ పంథాలకు మధ్యవున్న భేదమే.

కాంగ్రెసు మహాసభ నాయకత్వాన్ని చెలాయిస్తూన్న మితవాదులు ఉద్యోగ స్వీకారాన్ని బలపరచుట, ప్రజాశక్తులను ఉద్యమాన్ని పార్లమెంటరీ ఆందోళనా మార్గాలు మాత్రమే పట్టించాలని కోరుటవల్లనే. కాని సామ్రాజ్య ప్రతిఘాతుకపు ప్రజలు అతివాదుల పలుకుబడిక్రింద తెచ్చుచున్న ఒత్తిడిని గమనించారు. అందుచే మితవాదులు తమవెనుకంజను కప్పిపుచ్చడానికి, రాజ్యాంగ విధానం భగ్నం చేయాలనే తీవ్ర పదాలు, కొంతవరకు సర్వతోముఖమైన ఎన్నికల కార్యక్రమం అవలంబించారు.

ఈ అపాయాలను గుర్తించుటచేతనే ఉద్యోగస్వీకారానికి వ్యతిరేకంగా పోరాడాము. శాసనసభలు తమకేమోయిస్తాయనే భ్రమలు ప్రజల్ని ఆవరించి సామ్రాజ్య వ్యతిరేక పోరాటపు మార్గాన్నుండి వేరుపరచింది. అంతా మంత్రులే చేస్తారనే నమ్మకాల్ని మనం పోగొట్టాలి.

2. ఉద్యోగస్వీకారం అయిపోయింది. మన కర్తవ్యం ఏమిటంటే మంత్రివర్గాలు ప్రజాస్వామ్య హక్కులు కాపాడి, యీ రాజ్యాంగ విధానానికి వ్యతిరేకంగా పోరాడే శక్తులు బలపడటానికి సాయపడునట్లు చూడటం. ప్రజాసామాన్యం మంత్రులను ఎన్నికల ప్రణాళికను ఆచరణ యందుంచునట్లుల ఒత్తిడి చేయాలి. పౌరస్వాతంత్ర్యపు హక్కులను విశాలపరచుట, కార్మిక కర్షకులకు సంఘనిర్మాణానికి ఎక్కువ అవకాశాలిచ్చుట ద్వారా జాతీయ ఐక్యసంఘటనా శక్తులను రాజ్యాంగవిధానాన్ని, ఎదుర్కొనుటకు తయారు చెయ్యాలి.

మననినాదం "ఎన్నికల ప్రణాళికను అమలు జరపండి. లేదా రాజీనామా లివ్వండి" అని. ఈ నినాదం మంత్రివర్గాలకు ఎప్పుడూ వర్తించాలి. కాంగ్రెస్‌మంత్రివర్గాలున్న కాలంలో స్వాతంత్ర్య పోరాటం యొక్క బలాన్ని అన్నిముఖాల వృద్ధిచేయాలి. మన అవశ్య కర్తవ్యము అదే.

3. మంత్రివర్గాలు ఏర్పడిన తరువాత మొదటినాల్గునెలల ఫలితం ఏమిటి?

(A) ఎన్నికల సమయంలో జాగృత మొనర్చబడిన—కార్మిక కర్షకుల చైతన్యం ఈ నాల్గునెలల్లోనూ క్రమంగా వృద్ధి పొందింది. కాంగ్రెసు మంత్రులు అధికారం లోకి వచ్చుటతోనే యిచ్చినకొంఇది సౌకర్యాలు, చిన్నచిన్న ఉద్యోగుల (గ్రామాల) ప్రవర్తనలో వచ్చిన మార్పు వెనుకబడివున్న ప్రాంతాలలోని ప్రజాసామాన్యాన్ని ఉద్యమం లోకి తెచ్చింది.

(B) రాజకీయ బందీల విడుదల కొరకు, నిర్బంధాల రద్దుకొరకు, కార్మికుల హక్కుల కొరకు, రైతుల ఋణవిరామం శిస్తుల తగ్గింపు కొరకు ప్రజలు అతివాదుల నాయకత్వం క్రింద గావించిన ఆందోళన జయం పొందినది. (క) ప్రజాసమూహాలలో కదలిక కల్గించారు. నిర్మాణానికి ఉత్సాహం కల్గింది. (ఖ) ప్రజలు మంత్రులను ధనికుల అభివృద్ధి నిరోధకులకు వ్యతిరేకంగా నిలబడటానికి తగినబలం చేకూర్చుతున్నారు. ఈ కార్మికుల పోరాటానికి ఉత్సాహమిస్తోంది. (గ) ఈ ప్రజాందోళనా క్రమంలోపై కాంగ్రెసు సంఘాలు అంగీకరించక పోయినా, అతివాదుల చేతుల్లో వున్న స్థానిక కాంగ్రెసు, రైతు, కార్మిక సంఘాలమధ్య యునైటెడ్ ఫ్రంటు (సంయుక్త సంఘటన) ఏర్పడుతూవుంది. (ఉదా: కాన్పూరు బీహారు, ఒరిస్సా, మహారాష్ట్రంలో)

(c) ఈఘటనలయొక్క ఫలితంగా దేశమంతటా సమ్మెలు వ్యాపించాయి. రైతు ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ప్రజాసామాన్యం కాంగ్రెసు కార్యక్రమం అమలుజరుపగోరుతూంది. వేళ్లు పాదుకొనిపోయిన ధనవంతులు తమ స్వలాభాల కోసం వీనిని వ్యతిరేకించడం ఎక్కువయింది. పరిస్థితుల గమనించుచున్న సామ్రాజ్యవాదులు ధనవంతుల రెచ్చగొడుతున్నారు. కాంగ్రెసు మంత్రుల వృద్ధిగాంచుచున్న ప్రజాఉద్యమాన్ని నిర్బంధ విధానంతో ఎదుర్కొమని ప్రోత్సాహపరుస్తున్నారు. తీవ్రవాదులచే నడుప బడుచున్న యీ ఉద్యమాన్ని కమ్యూనిస్టుల ఉద్యమ మని పేరిడి, సామ్రాజ్యవాదుల ఏజెంట్లు, కాంగ్రెసు ననుసరించుతూన్న ప్రజలనుండి ఉద్యమాన్ని వేరుపరచి అణచివేయాలని ప్రయత్నిస్తున్నారు. జాతీయ ఐక్య సంఘటనలో చీలికలు కలిగించుట అతివాదులను కాంగ్రెసునుండి వేరుపరచుటయే వారి యూప్సితం.

4. కాంగ్రెసు మంత్రులు, మితవాదులు భీతిచెంది "అహింసాపరిస్థితుల కల్గించడానికి" అనే పేరుతో నిర్బంధ శాసనాల ప్రయోగించి, వృద్ధి చెందుచున్న ప్రజా ఉద్యమాన్ని అరికట్టుటకు ప్రయత్నిస్తున్నారు. [సమ్మెదారులపై 144 ప్రయోగించుట, షోలాపూర్ అహమ్మదాబాద్‌లో క్రిమినల్ లా ఎమెండ్‌మెంటు పాలన, మద్రాసులో బాటిల్‌వాలాపై 124 ఎ. రాజద్రోహ నేరమారోపించుట, కాన్పూరు కార్మికనాయకుల సంచారము అరికట్టుట] క్రింది కాంగ్రెసు కమిటీలకు వ్యతిరేక ఆందోళన చేయరాదని సూచనలిస్తున్నారు (గాంధిగారు హరిజన్‌లో ఉపన్యాసం, సత్యమూర్తి బెదరింపులు, నెహ్రూగారి స్టేటుమెంటు) ఈ సామ్రాజ్యవాదులచే సరియైన మార్గమని కొనియాడబడుచున్న యీ పంథా జాతీయపోరాటానికి వినాశకారణ మవుతుంది.

5. ఈ పరిస్థితుల్లో అతివాదుల కర్తవ్యం ఈక్రింది అంశాలనుబట్టి నిర్ణయించాలిసి వుంటుంది(a) ఎన్నికల వాగ్దానాలలో కొన్ని చేర్చక పోయినప్పటికి ప్రజలలో ముఖ్యంగా వెనుకబడి వున్న వారందరి యొక్క కాంగ్రెస్ మంత్రుల విశ్వాసాన్ని చూరగొంటున్నారు, (b) మంత్రివర్గం కాంగ్రెస్ వారిదగుటచే కాంగ్రెస్ పలుకుబడి క్రిందనున్న వారి రాజకీయభావాలు తమను బలపరచుచున్నంత కాలం యీపనులు చేస్తూవుంటారు. (c) ఈమంత్రులు కొంతవరకు ప్రజాభిప్రాయాన్ని ఒత్తిడిని లక్ష్యపెట్టుతున్నారు.

6. సంస్కరణవాదాన్ని, ఆందోళనను అరికట్టువంధాని ప్రతిఘటించాలసిన అవసరము ఎంతేనివుంది. కాని మంత్రులు సామ్రాజ్యవాదంలో కలసిపోయారనిగాని, పోతున్నారనిగాని భావించినంత మాత్రాన పోరాటము కొనసాగదు. ఏమైనా మంత్రులట్టి ధోరణివైపు మ్రొగ్గుచున్నారు. కాంగ్రెసుసంఘాలలోని ఒత్తిడి ద్వారాను బయట కార్మిక కర్షకుల ప్రత్యేక ఆందోళన ద్వారాను మంత్రుల ధోరణిని మార్చాలి. కాంగ్రెస్‌మంత్రుల ఎన్నికల ప్రణాళికను అమలుజరపాలని, లేనిచో కార్మిక రైతు సంఘాలతోపాటు, కాంగ్రెసుసంఘాలు, సభ్యులుకూడ అసమ్మతి తెలియజేయాలని మనం కోరాలి. అసమ్మతి శాసనసభ్యులద్వారా, పత్రికలద్వారా, ఊరేగింపులు, రాయభారాలుద్వారా, ప్రభుత్వ కార్యాలయాలకు యాత్రలు ద్వారా తెలియజేయాలి.

7. ఇవ్వబడిన సౌకర్యాలు తప్పక గుర్తించాలి, వానిని ప్రజలకు ఎరుకపరచి, వానిని ఆటంకపరచుటకు ప్రయత్నించిన ధనస్వాములు, అధికారుల ప్రయత్నాలను బహిరంగ పరచాలి. ఈపని కాంగ్రెసు కమిటీలు, రైతుసంఘాలు, కార్మికసంఘాల ద్వారా జరగాలి.

8. ఎన్నికల ప్రణాళికకు లోబడి ఆచరణాత్మకమగు బిల్లులను తయారుచేసి కార్మికసంఘాలు, రైతుసంఘాల ద్వారా ప్రచారం జరిపి, కాంగ్రెసుసంఘాల ఎం. యల్. ఏ. ల తోడ్పాటు సంపాదించి శాసనసభల ముందు పెట్టాలి. మంత్రులు ఉపపాదించిన బిల్లులను అర్థంచేసుకొని, ఆచరణాత్మకమైన సవరణలు సూచనలు కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక ననుసరించియే తేవాలి. ఈ సవరణలు బిల్లులు మంత్రుల వైఖరిని అశక్తతను బయటపెట్టాలను ఉద్దేశంతోగాక వెంటనే ఆచరణలో పెట్టుటకు తగినవిగాఉండాలి. వాటిని ప్రజలందరికి తెలియునటుల ప్రచారం చెయ్యాలి. అసాధ్యమైనవని యెంచువానిని ప్రజల ఆందోళన ద్వారా అధికారుల, వ్యతిరేకమైన ధనస్వాముల పలుకుబడి తగ్గించి, ఆచరణ సాధ్యమైనవిగా చెయ్యాలి.

8. కాంగ్రెసుకు వ్యతిరేకులైన అభివృద్ధినిరోధకులు తీవ్రమైన పదాలు ఉపయోగిస్తూ మంత్రులను అతివాదులవలె విమర్శించుతున్నారు. వీరు కాంగ్రెసు మంత్రివర్గాలనే గాక కాంగ్రెసు సంస్థలను ఎదుర్కొంటున్నారు. మనకట్టివారితో ఎట్టి సంబంధమూ లేదు. కాంగ్రెసు మంత్రివర్గాల భగ్నంచేయుట మనపని కాదు. కాంగ్రెసు కార్యక్రమానికి జాతీయ ఐక్యసంఘటనకు విరుద్ధముగా వారు పోకుండునటుల చూచుట మనవిధి. మంత్రులపై మన విమర్శన సున్నితంగా వుండాలి. కాని కాంగ్రెసు సంస్థను వారితో ముడిపెట్టరాదు. మంత్రులు వ్యక్తిగతంగా అవలంబించు తియాక్షనరీ

(తరువాయి 10 వ పేజీలో)

కొల్లూరు విద్యార్థుల సమ్మె

కొల్లూరు. డిస్ట్రిక్టుబోర్డు హైస్కూలు హెడ్మాష్టరుగారైన కందాళం హనుమంతరావుగారు ఈనెల 17వ తేదీవరకు స్కూలుఫైనలుక్లాసులో డిటెన్షన్సు ఉండవని చెప్పుచు 18 వ తేదీ ఉదయం 36 గురిలో 12 మంది పరీక్షకు పంపబడలేదని తెలియచేసిరి. అందులో 5 గురు రెండవసంవత్సర విద్యార్థులు గలరు. ఆ సాయంకాలమునుండి విద్యార్థులు సమ్మె సాగించిరి. రాజీప్రయత్నములు విఫలములయ్యెను. డి. బో. మెంబరు కానరనేని అంకినీడుగారుగూడ ప్రయత్నము చేసిరి. తుదకు డి. బో. ప్రెసిడెంటు, పాతూరు సుబ్బయ్యగారు కొల్లూరు వచ్చేసి విద్యార్థుల నందరిని పరీక్షలకు బంపునట్లు చేసిరి. తదితర డిమాండులను కూడ పూర్తిచేయుటకు వాగ్దత్తమిచ్చిరి. సమ్మె ముగిసినది.

వై. వి. క్రిష్ణారావు,
సమ్మెసంఘపు కార్యదర్శి.

కృష్ణాజిల్లా యువజనసంఘము,

పై యు॥ సం॥ కార్యనిర్వాహకవర్గం బెజవాడలో 16 తేదీ రాత్రి 8 గం॥ కు సమావేశమై ఈదిగువ తీర్మానములకు ఏకగ్రీవముగా ప్యాసుచేసినది. ఈ సమావేశమునకు కాట్రగడ్డ రాజగోపాలరావుగారి అధ్యక్షత వహించినారు.

తీర్మానములు :—

1. మార్చి 15 వ తారీఖులోపుగా వివిధగ్రామములందు యు॥ సం॥ ను స్థాపించి సభ్యులను విరివిగా చేర్పించవలసినదిగా యువజనసోదరులను ప్రార్థించడమైనది.

2. గుంటూరు ఎ. సి. కాలేజీలోను, తాడంకి గుడివాడ హైస్కూళ్ళలోను నిరంకుశత్వాన్ని ఎదిరించి సమ్మెలను జయప్రదముగా సాగించి నందులకు ఆయా విద్యార్థి సంఘములవారిని యీ సంఘమువారు హృదయపూర్వకముగా అభినందించుచున్నారు.

3. బీహారురాష్ట్రీయ కాం॥ సం॥ వారు రైతు సంఘములలో కాంగ్రెసువారు పాల్గొనరాదని చేసిన నిషేధము సామ్రాజ్య వ్యతిరేక పోరాటమును సన్నగిలచేయుచూ యునైటెడ్‌ఫ్రంటుకు భంగము కల్గించుచున్నదిగాన వారి చర్యను యీ సంఘమువారు తీవ్రముగా ఖడించుచున్నారు.

4. ఋణపరిష్కారచట్టము ఆంధ్రరాష్ట్రీయ రైతు సంఘమువారు సూచించిన సవరణల ప్రకారం తయారుచేయవలసినదిగా యీసంఘమువారు మద్రాసు ప్రభుత్వమువారిని కోరుచున్నారు.

5. జనవరి 26 వ తేది స్వాతంత్ర్య దినముగాన స్థానిక యు॥ సం॥ వారందరు ఆనాడు స్వాతంత్ర దినోత్సవములు జరుపవలెనని ఈసం॥ హెచ్చరించుచున్నాం.

రామినేని పిచ్చయ్య
స॥ కార్యదర్శి,
కృ॥ జి॥ యు॥ సం॥

పశ్చిమగోదావరిజిల్లా రాజకీయమహాసభ

★ లంకలకోడేరులో జనవరి 30 31, తేదీలలో జరుగును. ★

అధ్యక్షులు: కామ్రేడ్ మద్దూరి అన్నపూర్ణయ్య

ప్రారంభోపన్యాసకురాలు: కామ్రేడ్ కమలాదేవి (చటోపాధ్యాయ)

జిల్లా మహిళా మహాసభ

అధ్యక్షురాలు: డాక్టర్. కె. అచ్చమాంబగారు

ప్రారంభోపన్యాసకురాలు: వల్లభనేని సీతామహాలక్ష్మమ్మగారు

ఆహ్వాన సంఘం

దక్షిణదేశంలో సోషలిష్టు ప్రచారం.

ఈనెల 22 వ తేదీని కామ్రేడ్ మద్దూరి అన్నపూర్ణయ్య దిండివనములో ప్రథమ దక్షిణఆర్కాడు సోషలిష్టుమహాసభకు ప్రారంభోత్సవము సల్పుటకై వచ్చినారు. పుష్పమాలాంకృతుల గావించి వారిని పురవీధులలో ఊరేగించినపిదప 11 గం॥లకు సభాప్రారంభమైనది. అన్నపూర్ణయ్యగారు ఆంగ్లములో రెండుగంటలసేపు సామ్యవాదకక్షియొక్క ఆదర్శములను, కార్యక్రమాన్ని గూర్చి మహోపన్యాస మొసంగిరి. తమిళనాడు రాష్ట్ర సోషలిస్టుపార్టీ ప్రధానియగు కామ్రేడ్ జీవానందం అన్నపూర్ణయ్యగారి వుపన్యాసాన్ని తమిళములోనికి అనువదించారు. కామ్రేడ్ ఏ. కే గోపాలన్‌గారి అధ్యక్షతక్రింద సభ జయప్రదముగా ముగిసినది.

అన్నామలై విశ్వవిద్యాలయములో ఉపన్యాసాలు.

అన్నామలై విశ్వవిద్యాలయాల కోరికపై వారు చిదంబరం వెళ్ళినారు. తమిళయూనియన్‌వారి పక్షమున అన్నపూర్ణయ్యగారు, ఆంగ్లములో సామ్యవాదమునుగూర్చి రాత్రి 8 గం॥ లకు మహోపన్యాసమును గావించిరి. అనంతరము 10 గంటలకు ఆంధ్రసంఘంవారి యెదుటకూడ తెలుగులో ఉపన్యసించిరి. 80 మందిదాకా ఆంధ్రవిద్యార్థులు అన్నామలై విశ్వవిద్యాలయములో నున్నారు.

(ఒకవిలేఖరి.)

బెజవాడతాలూకా రైతుసంఘం

పై సంఘ యాజమాన్యమున ది 6—2—38 ఆదివారము ఉదయము 7 గం॥ నుండి శ్రీయుత అనవల్లపూడి వెంకటసీతారామారావుగారి ఆధ్వర్యముక్రింద నొక వలంటీరు దళము బయలుదేరి, కొండపల్లి మొఖాసాదారునిచే అన్యాయముగ బాధితులగు రైతులకు సహాయనిధి వసూలుచేయుటకును, రైతుసంఘములులేని గ్రామాలలో వాటిని స్థాపించుటకై తిరువూరు బెజవాడ తాలూకాలలో ప్రచారము చేయును. ఆదళములో ప్రచారము చేయదలచినవారు మా ఆఫీసునకు తెలియపర్చ గోరుతాను.

వీ. రామకోటయ్య చౌదరి
ప్రధాన కార్యదర్శి
బె. తా. రైతుసంఘము.

నవశక్తి

26—1—38 బుధవారం

స్వాతంత్ర్య దినోత్సవము

స్వాతంత్ర్య దిన యొక్క పదోవర్ధంతి యీ తేదీ న దేశమంతట జరుపవలెనని కాంగ్రెసు అధ్యక్షుని ఆజ్ఞ యైంది. ఆదినం పెట్టి నందు యేదో లాంఛనంగా జరుపటం కాదు. స్వాతంత్ర్యమో - మరణమో - యను దృఢ ప్రతిజ్ఞను పూనుట అవసరము. ఊరేగింపులు ఉత్సవాలు, సభలు తీర్మానాలు సాగించి వెళ్ళి పోవటము కాదు. స్వాతంత్ర్యం కొరకు తానేమి చేసింది, యేమిచేసేది పూర్తిమైన ఆత్మ పరీక్ష చేసికొని ప్రతివాడు నిర్ణయించుకోవాలి. స్వాతంత్ర్యం యొక్క నిజమైన అర్థమేమిటో, దానిని సాధించుటకు వలయు సాధన సంపత్తి నెట్లు సేకరించాలో ఆలోచించుకోవాలి. 1857 సం॥ రము నుండి యింతవరకు దేశంలో నడచిన స్వాతంత్ర్య పోరాటాల నొక్కమారు సింహావలోకనం చేయాలి. శాస్త్రీయ వివేచనా దృష్టితో స్వాతంత్ర్య పోరాట స్వభావాన్ని స్వరూపాన్ని నిర్ణయించుకోవాలి.

1857 సం॥ రములో జరిగిన స్వాతంత్ర్య యుద్ధం ("సిపాయి కలహము") రాజుల యొక్క, సైన్యాధిపతులయొక్క తిరుగుబాటు. నానా సాహేబు వంటి రాజనీతిజ్ఞుడు తాంతియా తోపే వంటి సేనాధిపతి, ఝాన్సీలక్ష్మీవంటి వీర నారీ శిరోమణి మున్నగువారి వీరగాథలు నేటికిని భారతి యువకుల నుత్సాహవంతులుగా చేస్తూనే యున్నవి. దాని పిమ్మట 1885 సంవత్సరములో కాంగ్రెసు మహాసంస్థ యేర్పడి దేశీయులను నడుపుచున్న తిలక్, లజపతిరాయి వంటి అతివాద నాయకశ్రేష్ఠులు తీవ్ర పద్ధతులపై ఆందోళనను సాగించినా, 1921 సం॥ రము వరకు మాత్రం అసలైన స్వరాజ్య పోరాటం ప్రారంభం కాలేదు. 1930-1932 సం॥ రములలో మహాత్ముని సత్యాగ్రహాస్త్ర ప్రయోగంవల్ల స్వాతంత్ర్యపోరాట మొక మెట్టెక్కింది. కాని అది చాలవరకు మధ్య తరగతి ప్రజలయొక్క మితవాద పోరాటంగా పరిణమించినా దేశస్థులను మాత్రం విశేషంగా మేల్కొల్పింది. కార్యక్రమం మితవాద పూరితమైనా విప్లవ శక్తులను కూడ కొంత కదలించింది.

కాని స్వాతంత్ర్యగమ్యస్థానాన్ని సజావుగాను, నిశ్చితంగాను చేరాలంటే అసలైన విప్లవపోరాటం దేశంలో సాగవలసి వుంటుంది. విప్లవశక్తుల యొక్క పూర్ణ విజృంభణము యేనాడు సాగుతుందో ఆనాడే సంపూర్ణము, సమగ్రము అయిన పోరాటం నడుస్తుంది. సామాన్యప్రజానీక మేనాడు తమ్ము బంధించి బిగించియున్న సంకెళ్లను ఛేదించుటకు సిద్ధపడునో నాడే సర్వతోముఖ స్వాతంత్ర్యం సిద్ధిస్తుంది. అట్టి పాటకజన స్వాతంత్ర్య పోరాటానికై సకల జనులును నడుముకట్టునట్లు స్వాతంత్ర్యదినము శపథం చెయ్యాలి.

రాజుల, జమీందారుల, మిలటరీ అధికారుల తిరుగుబాటు (Feudal revolt) 1857 వ సం॥ రంలో విఫలమైంది. మధ్యతరగతి ప్రజల సత్యాగ్రహసమరం (Middle class revolt) 1921, 1930, 1932 సం॥ రములలో జయప్రదంగా సాగలేకపోయింది. అశేష పాటకజనంయొక్క అంతిమపోరాటమే (Mass revolt) జయభేరిని మ్రోగింపగలదను గుణపాఠాన్ని గ్రహించి అట్టి అంతిమ పోరాటమునకు పునాది వేయుటే యీ 26 వ తేదీని దేశీయులెల్లరు పూనవలసిన ప్రతిజ్ఞయొక్క అంతర్యము.

ఫల రహితమైన పార్లమెంటరీ కార్యక్రమము పై హెచ్చు మోజుంచి తీవ్రవాద శక్తులను తొక్కిపెట్టయుంచరాదను యీ అభాగ్యపు రోజులలో స్వాతంత్ర్యోత్సవం యొక్క అంతరార్థాన్ని బాగుగా గ్రహించాలి. దేశపరిస్థితులను బాగుగ అర్థం చేసుకోవాలి. ఫెడరల్ రాజ్యాంగ విధానాన్ని మనపై రుద్దుటకు పన్నాలు పన్నుతోంది పరప్రభుత్వం. సంగ్రామకారుమేఘాలు నలుదెసల అలముకొని లోకము నంతను గాఢరా పెడుతున్నాయి.

జపాను సామ్రాజ్యకాంతను, సమరాగ్నిని ఎదుర్కొనుటకు చైనాలో జాతీయవాదులు సామ్యవాదులు చేతులు కలిపి జాతీయైక్యసంఘటనమును సాగించి శత్రు విజృంభణాన్ని అరికడుతున్నారు. ఫేసిస్టు ముండగీముల ధనమనుష్య పరికర సహాయముతో తిరుగుబాటును లేవదీసిన ధనిక వర్గాలను ఢీకొనుచు, దేశస్వాతంత్ర్య రక్షణ దీక్షను గైకొని, స్పెయినులో రైతులు, కూలీలు, నాయకులు, ఒక్కుమ్మడిగా పోరాడుతున్నారు. ఇట్లు సంయుక్త సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘటన యొక్క ప్రయోజనాన్ని పూర్తిగా గ్రహించి ఆ దేశాలలో నాయకులు వ్యవహరిస్తుంటే మనదేశంలో, మన కాంగ్రెసు ప్రభుత్వములు, మననాయకులు, అతివాదశక్తుల నణగద్రొక్కుట కొకవంక నిషేధ విధింపరులు, వేరొకవంక డిసిప్లినరీ చర్యలు అవలంబించుచున్నారు శోచనీయము. స్వాతంత్ర్య సంగ్రామ ప్రథమపంక్తిలో బారులుతీర్చి నిలబడగల యోధవర్యులను నీరసపరచుటచే స్వాతంత్ర్యపోరాటానికి కలుగబోవు నష్టాన్ని నాయకులు గుర్తించాలని కోరుతున్నాం.

"నిర్బంధవిధానం నశించాలి" అను నినాదంతో "స్వాతంత్ర్య జయభేరిని మ్రోగించాలి" అనే నినాదాన్ని జోడించి 26 వ తేదీని దేశీయులెల్లరు స్వాతంత్ర్యదీక్షను పూని అంతిమపోరాటానికి తయారుకావాలని హెచ్చరిస్తున్నాం.

పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయమహాసభా కార్యక్రమం

30—1—38 వ తేదీ ఆదివారం

ఉదయం గం॥ 10 లకు లంకలకోడేరు రైల్వే స్టేషనులో నాయకులను ఆహ్వానించుట.

గం 1 మొ గం 3 ల వరకు విషయనిర్ణయసభ (జిల్లాకాంగ్రెసు కమిటీ)

గం 3 మొ గం 3—30 వ ఊరేగింపు

గం 4 మొ 4—30 వరకు జాతీయ పతాకోత్సవము.

గం 5 లకు మహాసభ ప్రారంభము. ఆహ్వాన సంఘాధ్యక్షోపన్యాసము.

గం 6 మొ. శ్రీమతి కమలాదేవి (చటోపాధ్యాయ) గారి ప్రారంభోపన్యాసము.

గం 7 మొ॥ 8 వరకు అన్నపూర్ణయ్యగారి అధ్యక్షోపన్యాసం

గం 8 మొ 9 వరకు భోజనం.

గం 9 మొ॥ గం 11 వరకు గానసభలు.

(ప్రఖ్యాతిచెందిన గాయకులు వత్తురు)

31—1—38 వ తేదీ సోమవారం కార్యక్రమము.

ఉదయం గం 8 ల మొ గం 10 వరకు తిరిగి విషయ నిర్ణయ సభ.

గం 10 మొ గం 11 వరకు భోజనం.

గం 11 ల మొ. జిల్లామహిళాసభ. అధ్యక్షురాలు డాక్టర్ కె. అచ్చమాంబగారు. శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మగారి ప్రారంభోపన్యాసం.

గం 12 లకు అధ్యక్షోపన్యాసం—తీర్మానాలు.

సాయంత్రం గం 3 లకు స్త్రీలసభ ముగింపు.

గం 2 ల మొ 4 ల వరకు (గొప్పవస్తాదుల) కుస్తీ, వ్యాయామ ప్రదర్శనాలు.

గం 4 లకు జిల్లా రాజకీయమహాసభా సమావేశము—తీర్మానాలు.

అత్రితో సభలన్నియు ముగియునుగాన ఎల్లరు బహిరంగ సమావేశాలకు పాల్గొని జయప్రద మొనర్పవలెనని కోరుచున్నాను.

అల్లూరి సత్యనారాయణ

జమీందారీ విధానము నశించాలి ★

ఆంధ్రరాష్ట్ర జమీన్ రైతుల కోర్కెలు

మద్రాసుప్రభుత్వ రివిన్యూశాఖా మంత్రిగారైన గౌ॥ టంగుటూరి ప్రకాశంపంతులువారికిని మద్రాసుప్రభుత్వ జమీందారీ విచారణ పార్లమెంటరీ సంఘమువారికిని. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘపక్షమునను, ఆంధ్రరాష్ట్ర జమీన్ రైతుసంఘపక్షమునను రైతురక్షణ యాత్రాసందర్భమును పురస్కరించుకొని ఆంధ్రదేశ జమీన్ రైతులతరపున సమర్పించుకొన్న మెమొరాండం.

(1) (a) జమీందారీపద్ధతి ప్రజలకుపకరించక కేవలము రైతుల ఆర్థిక, రాజకీయ జీవితముల నిస్సారపరుచుచున్నది గాన నేటికాలమున అనవసరమైన యీ జమీందారీపద్ధతి పూర్తిగా రద్దు చేయవలయును.

(b) ప్రభుత్వము రైతులు చెల్లించు శిస్తులో కొద్ది భాగమునే పేష్కసుగా పుచ్చుకొనుటచేతను, రైతుల కష్టార్జితమగు కోట్లకొలది ధనమును ప్రభుత్వమే రైతుల ఆర్థిక సాంఘిక అభివృద్ధి అవసరముల కొరకు వినియోగించుట కున్నదిగనుక, రైతుల తదితర జనసామాన్యాల రక్షణకొరకై కొలదిమంది వ్యక్తుల భోగమునకే వుపయోగపడుచున్న యీ జమీందారీపద్ధతిని త్వరలోనే తొలగించుట ప్రజల మేలు గోరు ప్రభుత్వ ధర్మమై యున్నది.

పర్మనెంటు సెటిల్‌మెంటుద్వారా రాష్ట్రములోని జమీందార్లు మితిమించిన శిస్తుల ఆదాయము పొందుచు అశాస్త్రీయ శిస్తు నిర్ణయముగల మితిమించిన వ్యయమునకు కారణమైన యీ జమీందారీ పరిపాలనవలనను, దానిమీద పెత్తనదారులైన జమీందారులు ఏవిధముగాను ల్యాండురెవిన్యూ ఫారెస్టు యిరిగేషను మొదలగు పబ్లిక్ కార్యనిర్వాహణము చేయలేక చేయించుకొనలేక పోవుటచేత యీ జమీందారీల పాలనము యిట్టి అసమర్థులు, రాజకీయ, ఆర్థిక, సాంఘిక వ్యవహారములనుబట్టి రైతులపై అనేకవిధములైన క్రౌర్యములు చేయుచుండువారైన ఈ జమీందార్ల క్రిందయికను ఎంతమాత్రము ఉంచుట ధర్మముకాదు. కావున జమీందారీల నన్నిటిని ప్రభుత్వ పరిపాలన క్రిందకు తీసుకొని రైతువారీ గ్రామాలవలెనే సర్వ శిస్తుల నిర్ణయము తగ్గుదల మరమ్మతులు, శిస్తులవసూళ్లు, అవసరమైన వగైరాలు యావత్తు చేసి వీటికగు యావత్తు పాలన ఖర్చులు మినహాయించుకొని మిగిలిన ఆదాయము ప్రస్తుతరాజకీయ పరిస్థితులనుబట్టి అవసరమైనచో జమీందారులకు యిచ్చుకోవచ్చును.

యింతలోపల ఎస్టేటుల్యాండుయాక్టులో యీక్రింది మార్పులను ముఖ్యముగా వెంటనే చేయుట అవసరమని కోరుచున్నాము.

శిస్తుల నిర్ణయము.

శిస్తులు ప్రస్తుతం చుట్టుప్రక్కల రైతువారీరేట్ల ప్రకారమే వెంటనే (అనగా ఆక్టు అమలుకు వచ్చిన సంవత్సరంలోనే) సవరణ కావలయును. రైతువారీలో తగ్గినప్పుడు జమీందారీలలోకూడ తగ్గవలయును. ఆర్థికమాంద్యముచే రైతువారీలలో తాత్కాలిక రిమిషన్ యిచ్చినప్పుడు ఆమాదిరిగానే జమీందారీలలోగూడ రిమిషన్ యిచ్చుచుండవలెను.

శిస్తుల రిమిషన్.

వర్షములు లేనందునను, వర్షములు హెచ్చుఅవుటచేతనున్నూ దైవిక రాజకీయములచేత పంటలు నష్టమువచ్చినప్పుడును, సాగుబడి కానప్పుడును శిస్తులు గవర్నమెంటువారి సూపర్‌వైజన్ క్రింద మెరక, పల్లములకు విధిగా రిమిషనులు ఇయ్యవలెను. నాల్గు అణాలు మదింపుకు మించని పంటలు పండినప్పుడు విధిగా శిస్తురిమిషన్ యిప్పించవలెను.

నీటి వసతులు.

చెర్వులు, కాలవలు వగైరా నీటివసతులన్నియు అప్లికేషను అవసరాలతో లేకుండ ప్రభుత్వంవారు వెంటనే వకేపర్యాయము మరమ్మతుచేయించి దర్మిలా మరమ్మతులు నీటిపంపకము వగైరాలు గ్రామపంచాయితీలకు యివ్వవలెను. మరియు ఏ జలాశయమైనను రెండు లేక అదనపు గ్రామాలకు చెంది భిన్నహక్కులు పాలనముచెందియున్నచో అవసరమైన విధంగా పంపుటయు, లేక ప్రత్యేక పాలన క్రిందనైనను తేవలెను.

చేపల శిస్తులు.

చెరువులు, ఏరులు, కాలువలలోగల చేపలు, దుంపలు వగైరాలమీద పూర్తిపెత్తనం పంచాయితీలకే వుండవలెను.

చెరువుల మరమ్మతులు.

అప్పుటప్పటికి అవసరమయ్యే మరమ్మతులు చేయించుచుండుటకుగాను, జలాశయ రక్షణనిర్మాణాన్ని నిర్మించి దానికి పల్లపుభూమి సిస్తులనుండి రూపాయికి నాల్గు అణాలుకు తగ్గకుండా యివ్వవలెను.

అడవులు (పశువుల మేత)

అడవులలో రైతుసర్మనెంటు సెటిల్మెంటుకు ముందు కంపలు ఉచితముగ అనుభవించుచున్న కట్టెపుల్లలు, కలప, ఆకు గృహ నిర్మాణ సామానులు ఉచితముగా తెచ్చుకొను అధికారము గ్రామవాసులకందరికి ఉండవలయును. మరియు పశువులను ఉచితముగా మేపుకొను ఆచారమును చట్టముద్వారా స్థిరపరచవలెను. అడవులమీద, పశువుల మేతమీద యావత్తు అధికారములు గ్రామపంచాయితీలకు యివ్వవలెను. ఎట్టిపరిస్థితులలోగాని జమీందారీ అడవులను అటవీ శాసనం క్రిందకు తేరాదు.

బందెల దొడ్డి.

పొందు ఆదాయము (బందెల దొడ్డి) యావత్తు పంచాయితీలకే యివ్వవలెను.

శిస్తుల వసూళ్లు.

గవర్నమెంటు వాయిదాల ప్రకారమే వీలైనంతవరకు ఫిబ్రవరినుండి ప్రారంభించి నాల్గు కిస్తీలుగా రాబట్టుకోవలెను. యిప్పటివరకు వసూలుచేయబడుచున్న అన్నివిధములైన అదనపుపన్నుల వసూళ్లు అక్రమమైనవిగా పరిగణించి వసూలుచేయువారికి శిక్షల నిర్ణయించవలెను. ఎట్టిపరిస్థితులందైనను ఏలాంటి భూములకైనను నజరానాలు వసూలుచేయరాదు.

(ఇంకావుంది)

బాపట్ల విద్యార్థుల సమ్మె

19 వ తారీఖున హైస్కూలు విద్యార్థిసంఘము సమావేశమై విద్యార్థులపురోభివృద్ధికి ఆటంకమగు శిక్షలనుపద్ధతి తీసివేయవలసినదిగా హెడ్‌మాష్టరుగార్ని కోరుచు తీర్మానించిరి, విజ్ఞప్తి పంపగా నిరాకరించిరి, అందువల్ల వారిహక్కులను సాధించుకొనుటకై 20 తారీఖున సమ్మెసాగించిరి 600 విద్యార్థులకుగాను 550మంది సమ్మెలో చేరిరి. గుంటూరు ఎ. సి. కాలేజి విద్యార్థిసంఘ ప్రతినిధులు వచ్చి సమ్మెను జయప్రదముగా నడిపిరి. ఆనాటిసాయంత్రము ఊరేగింపుతో వచ్చి గాంధీచౌకువద్ద బహిరంగసభ జరిపిరి. కొడాలి ఆంజనేయులు, యం. రాధాకృష్ణ మొదలగువారు వుపన్యసించిరి,

21 వ తారీఖు వుదయమున సేవాసమితి సభ్యులు, కామ్రేడ్ మునిపల్లె రామారావుగారును హెడ్‌మాష్టరు వద్దకు వెళ్ళి వారితో మాట్లాడి సమ్మె ముగింపుచేసిరి. స్కూలుఫైనలు విద్యార్థుల నందరను పరీక్షకు పంపెదమని అన్నిక్లాసులకు వెళ్ళి హెడ్‌మాష్టరుగారు ప్రకటించి యితరషరతులకుగూడ ఒప్పుకొనిరి.

ఈసమ్మె జయముగాంచినందులకు 21 సాయంత్రము కామ్రేడ్ మునిపల్లె రామారావుగారి అధ్యక్షత క్రింద సభ జరుపబడెను. హైస్కూలు విద్యార్థియగు పి. కోనయ్యశర్మగారు తమసంఘముయొక్క యిబ్బందులగూర్చి విపులముగా మాట్లాడిరి. పిదప మునిపల్లె రామారావుగారు ప్రస్తుత విద్యావిధానములోవున్న లోటుపాట్లనుగూర్చియు, విద్యార్థులందరు రాజకీయ పోరాటములో యెక్కువ పనిచేయవలయు ననియు నుచెప్పిరి. అంతట "విద్యార్థిసంఘములకు జై" అను ధ్వనులతో సభ ముగిసెను.

మంత్రులు—మన కర్తవ్యం

(6 వ పేజీ తరువాయి)

గమనాన్ని కాంగ్రెసు సంస్థకంతకు ఆపాదించకూడదు. మనం కాంగ్రెస్‌లోనూ, కాంగ్రెసుతోనూ కలిసి, పనిచేసి మంత్రులు "వెనుకడుగు" వేయుటకు వీలుపడనివ్వని ప్రజాభిప్రాయాన్ని కలుగచేయాలి.

10. ప్రజల సంఘాలు, పోరాటం వృద్ధి పొందిన కొలదీ, కార్మికుల కర్షకుల పోరాటం తీవ్రమయిన కొలదీ జాతీయతకు విరోధులయిన ధనికులకు అధికారులకును ఏలిక మంత్రులు, కార్మిక కర్షక నాయకుల కమ్యూనిస్టులు సోషలిస్టులని పేరిడి, కాంగ్రెసువాదుల నుంచి వారిని వెడలనేసి అణచివేయ గోరుచున్నారు. అట్టి ఆరోపణలను కాంగ్రెసువాదులలో ప్రచారం గావించి, నిర్బంధవిధానం అవలంబించుట (షోలాపూర్, అహమ్మదాబాదులలోవలె) కాంగ్రెసుసూత్రాలకి విరుద్ధమని నిరూపించాలి. కాంగ్రెసుమహాసభ సంఘాలు నిర్మించుకోడానికి, సమ్మెచేయడానికి గల హక్కును అంగీకరించింది. అధికారులకు, పెట్టుబడిదారుల కిష్టమైన ట్లు నిర్బంధవిధానం వేపట్టుట కాంగ్రెసుకు విరుద్ధం. "ఒక్కొక్కప్పుడు యీనిర్బంధపు ఉత్తరువుల ఉల్లంఘించి పోలీసులకు అధికారులకు వ్యతిరేకభావాలుకల్గిన కాంగ్రెసు ననుసరించే ప్రజల సానుభూతి పొందుట అవసరము" ఈవిధంగా కాంగ్రెసుమంత్రుల అధికారంక్రింద ముందుకు పోగలిగిన ఒక్కొక్కమెట్టు యింకా ముందుకు పోవానికీ ఉపయోగించుకోవాలి.

11 కాంగ్రెసుమంత్రు లవలంబించుచున్న వినాశకరమైన పద్ధతిని సోషలిష్టులం అరికట్టలేకపోవుట. నిర్బంధవిధానాన్ని బలపరచేవారు (తమిలనాడ్, గుజరాత్) ముందుకుసాగుటకు కారణాలివి.(1)అతివాదుల్లో ఐకమత్యం లేకపోవుట. సోషలిష్టులుస్థానిక కాంగ్రెస్ సంఘాలను తమవైపుకు మరల్చలేకపోవుట. (2) కార్మిక కర్షకుల దినదినపోరాటానికి కాంగ్రెసుసంఘాలకు సంబంధం చేకూర్చలేకపోవుట. మనం మంత్రులు కాంగ్రెస్ కార్యక్రమానికి విరుద్ధంగాజరిపే పనులను ప్రజలకు తెలియజేసి, మంత్రులు, కార్యక్రమాన్ని కొనసాగించాలి లేకపోయిన రాజీనామానిచ్చి, కొనసాగించేవారికి లావివ్వాలని ప్రజలు హెచ్చరించునటుల చేయాలి. ఈవిధానంవలన కాంగ్రెస్ అనుచరులు సంఘాలు, బ్రిటీషు యిండియాలోనూ సంస్థానాలలోనూ పౌరసత్వహక్కులకొరకు జరిగే పోరాటమును, రైతుల కనీసపు కోర్కెలను, కార్మికుల నిర్మాణ హక్కు, సమ్మెచేయు హక్కులను బలపరచటానికి సిద్ధపడతాయి. సామ్రాజ్యవాదుల, స్వాతంత్ర్యనిరోధకులగు ధనికుల ప్రోత్సాహంచే గావించబడుచున్న నిర్బంధవిధానానికి వ్యతిరేకంగానూ, మితవాదులు సమర్థించుకోడానికి ఉపయోగించుతున్న "అహింసా" మంత్రంలోనిబూటకత్వం రుజువుపరుస్తూనూప్రచారం గావించాలి. తద్వారా కాంగ్రెసుమంత్రులు సామ్రాజ్య వ్యతిరేక కాంగ్రెస్ కార్యక్రమానికి విరుద్ధంగా పోకుండా చేయగలరు. జాతీయ ఐక్యతను కాపాడగలరు. ఫెడరేషను, బానిసరాజ్యాంగాన్ని ప్రజాఉద్యమం ద్వారా భగ్నం చేయగలరు.

గ్రంథావలోకనం

విజ్ఞానము

(రెండునెలల కొకసారి ప్రకటింపబడే పత్రిక.)

సంపాదకులు.

కాశీపట్నపు కొండయ్య, ఎం. ఎస్. సి.

విడిసంచిక 12 అణాలు.

కార్యస్థానం, రాజమండ్రి.)

విజ్ఞానం మూడవసంచిక మాకందినది. విజ్ఞానంలోని ప్రతివ్యాసమూ విజ్ఞానాన్ని కలుగజేస్తున్నది. సామాన్యంగా సైన్సు చదవడంఅన్నా ,అర్థం చేసికోవాలన్నా క్లిష్టమైన విషయమని తోసివేస్తారు చాలమంది. విజ్ఞానం చదివితే ఆ అభిప్రాయం మార్చుకోవాలసి వస్తుంది. ప్రతివ్యాసమూ వ్యవహారికశైలిలో బాగా అర్థమయేటట్టు ఉన్నది. సైన్సులో మార్పులు రాక దానిమీద ఏవగించుకొనే బడిపిల్లకాయకూడా విజ్ఞానం చదవడం ప్రారంభించితే తుదివరకూ విడిచిపెట్టరనుకొంటాము. ఇది ఒక్క ఇంగ్లీషు చదువుకోని వారికేగాక సైన్సును ప్రత్యేకంగా పరిశీలించని ఇంగ్లీషు విద్యార్థులకుకూడ ఉపయోగిస్తుంది.

ఇలాంటి పత్రికతో ఆంధ్రదేశానికి ఉపకారంచేస్తున్న సంపాదకులు స్తవనీయులు.

పత్రిక గెటప్ బాగాఉంది. మంచికాగితం ఉపయోగించారు. వెలమాత్రం అధికమనిపిస్తుంది. కాని పత్రికను అభిమానంతో ప్రోత్సహించి వ్యవస్థాపకులచే వెల తగ్గింపజేసే భారం పాఠకులదే.

తక్షణ సమస్యలు

కార్మికులు.

జీతాలకోత రద్దుకొరకు, కార్మికసంఘాలను రికగ్నైజుచేయుటకొరకు పోరాటం సాగుతూంది. విచారణసంఘాలు నియమించారు. పెట్టుబడిదారుల నిరోధంవలను ముందు పోరాటం సిద్ధంగా వుంది. మనం ప్రజాభిప్రాయాన్ని కాంగ్రెసు అనుచరుల కార్మికుల కోర్కెలను బలపరుచునటుల చూడాలి. ఈపోరాటాలకు ప్రజల సానుభూతి సంపాదించి వారితో సన్నిహిత సంబంధం సంపాదించాలి.

ఈపునాదిపైనే మనం కనీసపుకూలి, భీమా శాసనాలు చేయుటకు, కార్మికులకు వ్యతిరేకమైన శాసనాలు రద్దుచేయుటకు పోరాటం సాగించాలి.

రైతులు.

మక్తాలు, పన్నులుతగ్గించుటకు, పుల్లరిరేట్లు రద్దు చేయుటకు, శిస్తుబకాయిల వాయిదాలు అపుచేయుటకు, అప్పుల మారుటోరియంకొరకు ఆందోళన పోరాటం యొక్క మొదటిస్థాయి. వీనిని ఆచరణలో పెట్టుటకు పోరాటంసాగింది.

కవులుదార్లు జమీన్‌రైతులకు భూమిపైహక్కుల నిచ్చుటకు. మక్తాల, భూమిశిస్తు అప్పులు, సగానికి తగ్గించుటకు శాసనాలుగావించుట తరువాత పోరాటం యొక్క ధ్యేయం అధికారుల బిల్లులుచదివి, అభివృద్ధిని కోరేసవరణలు సూచించాలి.

పౌరసత్వ హక్కులు

నిర్బంధశాసనాలు, ప్రెస్‌అక్టు, ఎమర్జెన్సీ పవర్సు అక్టు, క్రిమినల్ లాఅమెండ్‌మెంటు రద్దు చేయాలని. కమ్యూనిష్టు పార్టీపై నిషేధంతెలగించాలని. మనశక్తుల కేంద్రీకరించి ఒత్తిడి తీసుకురావాలి. ఇకముందు రాజద్రోహానికి (సెడిషన్) అరెష్టులు ఉండరాదు.

సోవియటు నీగ్రో ఓటు

వేలాండ్‌రచ్ 40 ఏండ్ల నీగ్రో, ఇపుడు సోవియట్ పౌరుడు. నటుడు. గాయకుడు, రష్యాకు 5 ఏండ్ల క్రితం వచ్చాడు. బొంబాయి క్రానికల్ మాస్కోవిలేఖరి అతనిని కలసికొన్నాడు.

పోలింగ్ బూత్‌లోనుంచి సంతోషం పట్టలేకుండా ఉన్నముఖంతోవేలాండ్ బయటకు వచ్చాడు. "నా జీవితంలోని మొదటి పర్యాయం ఓటువేసాను అబ్బాయీ" అనిఅన్నాడు.

వేలాండ్ అమెరికా విడచి రావడానికి కారణం ఏమిటని విలేఖరి అడిగాడు. వేలాండ్ ఇలాసమాధానం చెప్పాడు. "అక్కడ నేను పీల్చే వాయువు నాదికాదు. అక్కడ అనేక పార్కులు, పబ్లిక్ స్థలాలు—నేను ప్రవేశించరానివి-ఎన్నోఉన్నవి. నాకు అమెరికాఎలక్షన్ రోజులు బాగాజ్ఞాపకం ఉన్నాయి. వీధుల్లోని పిల్లలు-వాళ్ళ కంతకంటే ఏమితెలియదు— నీగ్రోలను ఎగతాళి చేస్తూ: "నిగర్-నిగర్-నిగర్" అంటూ అరచేవాళ్ళు.

నేను నోరు మెదపడానికి సాహసించే వాణ్ణి గాదు. ఆదేశంలోని 'లా' పతితులని-అణగద్రొక్కపడినవారిని-ముఖ్యంగా 'నల్లవాళ్ళ'ని రక్షించేందుకు నిర్మించబడలేదు.

నేను నల్లవాణ్ణి—నీగ్రోను— అందుకు గర్వపడతాను.

కాని నాకీధైర్యం కల్గించింది అమెరికా కాదు. నేను సోవియట్ పోలింగ్‌బూతుకు నడుస్తుంటే నా ఉద్రేకం చావలేదు. ఇక్కడ పిల్లలు నన్ను ఎగతాళిచేసి రాళ్లు రువ్వలేదు పేర్లు పెట్టలేదు. కాని నావెంటబడి "కాళ్ల వెనక ప్రక్కన మార్చునేవాడివా, నీగ్రోలను బ్రతికి ఉండగానే కాలుస్తారా" చెప్పమని బ్రతిమాలుతూ వెంటబడేవారు.

"నేనెచటికి వెళ్ళినా ఒక్కరూ 'నీవురాగూడదని' తలుపులు బిడాయించలేదు. నేనిక్కడ పీల్చే గాలి నాది. నాస్వేచ్ఛకు అడ్డులేదు ఇక్కడ. "నిగర్స్-కుక్కలు" కు ప్రవేశంలేదని ఇక్కడ ఎచ్చటా పార్కులవద్ద నైను బోర్డులు లేవు.

సుత్తి కొడవలి ఒప్పులతో ఎగురుతూఉన్న ఆ జండాలు నావి. అవిప్రజలవాలు నాకు-నాకేగాదు లక్షలకొలది జనులకురక్షణ. అణగద్రొక్కపడిన జాతులయొక్క కష్టజీవులయొక్క పతాకమయిన ఆ ఎర్రజండాకు నేను నావిశ్వాసాన్ని ప్రకటించాను. సమయంవస్తే దాన్ని రక్షించేందుకు మరణిస్తాను.

నాప్యాస్‌పోర్టు చూపించి నా ఓటును తీసుకొన్న తర్వాత నేవోటుచేసే ప్రతినిధులు 'నల్లవాళ్ళ' క్షేమం కోరే శాసనాలు చేస్తారని అని సందేహించ నవసరం లేదు.

తెల్ల, నల్ల, జాతులు, మతము, లింగము అనే ఏ భేదం లేకుండా, అంతర్జాతీయ స్వాతంత్ర్యానికి పోరాడే కమ్యూనిష్టుపార్టీ సిద్ధాంతాలకు వాళ్లకట్టుబడి ఉంటారని నానమ్మకం.

దినోత్సవాలు

ఆంధ్రదేశమంతటనుండీ, సకలత్‌వాలా, లెనిన్ దినోత్సవాలూ, రైతురక్షణ యాత్రలూ, బీహార్ దినోత్సవమూ జరిగినట్లు పలువురుమిత్రులు వ్రాయుచున్నారు. స్థలాభావముచే ఈసారికి ప్రకటించలేనందుకు చింతిలుచున్నాము.

సంపాదకుడు—

చీనా జపాను యుద్ధానికి పూర్వగాథ

(3 వ పేజీ తరువాయి)

వెనుక, అనేకపట్టణములలోని వాళ్లు వేలమంది జనులను కేవలము సానుభూతిపరులనుటకు, కమ్యూనిష్టులను, వ్యతిరేకులను, చంపివేసిరి.

చాంగ్‌షా నగరపు పోరాటము ముగిసిన వెనుక, యీ విదేశ సామ్రాజ్య ప్రభుత్వములు నాంకింగు ప్రభుత్వమును, వారి యధ్యక్షుడగు చాంకీషేకును గలిసి, యీ కమ్యూనిష్టులను, వారిరాజ్యమును, పటాలములను, నాశనము చేసినగాని, వారు చాంగ్ షేకు ప్రభుత్వమును పరిగణింపమని చెప్పిరి. దేశములో కమ్యూనిష్టు రాజ్యమును నిర్మూలింపనియెడల, చాంకేషేకుయొక్క యాధిపత్యమును పరిగణింపకయే వారు చైనాయొక్క యాంతరంగిక రాజకీయములలో జోక్యము కలుగజేసికొందుమని యీ విదేశ సామ్రాజ్యములు చాంకేషేకుకు చెప్పిరి. యీ బెదిరింపు జూచి చాంకేషేకు తనదేశము విదేశపు సామ్రాజ్యములచే కొల్లగొట్టబడుటను మరచి కమ్యూనిష్టు రాజ్యముపై దండయాత్ర ప్రారంభించెను. కాని యీదండయాత్రలు

జపాను దండయాత్రలు

చాలనిష్ప్రయోజనము లయ్యెను. 1931 లో జపాను దేశము తనదేశపు ప్రజలను సరియగు రక్షణను, చైనా ప్రభుత్వమువా రిచ్చుటలేదను మిషతో, మంచూరియాలో కొంతభాగము యాక్రమించుకొని మంచూకోయను రాష్ట్రములో తనప్రభుత్వమును నెలకొల్పెను. జపానువారు చైనాలో చేయుకుట్రలు చాల నీచమగునవి. జపాను గూఢచారులు ప్రతిచైనా పట్టణమున యున్నారు. ఎప్పుడైనను జపానునకొకప్రదేశ మాక్రమింపవలెనను కోర్కె కల్గినను, ఒకపరిదేశములో లేని హక్కొక్కటి స్థాపింపనెంచినను యీగూఢచారు లొక కలహమును కల్పింతురు. యీ కలహము తిబూటకపు కలహమైన గావచ్చును. యిట్టి యసంగ్రపు పోరాటమైన గావచ్చును. కాని యిట్టి కలహము యొకగొప్ప యంతర్జాతీయ శాంతిని భంగమొనర్చు పోరాటమునకు నెపముగా జపానుదేశము యెంచి, తన పటాలములను చైనా రాజ్యములోనికి బంపును.యిక చాంకేషేకు దేశమున కమ్యూనిష్టు రాజ్యములను నిర్మూలింపజేయవలెనను విదేశ సామ్రాజ్యవాదుల యాజ్ఞ, నిర్వర్తించుటయే, ప్రథమ కర్తవ్యముగా యేర్పడినది. అందువలన, తాను కమ్యూనిష్టు పటాలములపై దండయాత్రి వెడలుటకుయు జపాను సైనికులు లెప్పుడు బెదిరించిన యప్పుడు వెనకకు వచ్చుటయు చైనాలో కొన్నిరాజ్యములు జపాను వశము చేయుటయు తరచు జరుగు యంశములైనవి.

కాని చాంకేషేకు కమ్యూనిస్టులపై జరుపు దండయాత్రలంత జయప్రదములుగా యుండలేదు. తమ కనుకూలముగాయున్న రాజ్యములని యనబడుప్రదేశములు దాటి, కమ్యూనిస్టుల రాజ్యములలో దొరబడిన వెనుక వెనుకప్రదేశములలోని కర్షకులు,యీచాంకేషేకు,సైన్యమును వెనుకనుండి ముట్టడించుటయు ముందున్న కమ్యూనిస్టులు యీ సైన్యమును చుట్టి వారిని నాశనముచేయుట జరుగుచుండెను. కమ్యూనిష్టురాజ్యములలో కర్షకులపరిస్థితి యత్యంత యనుకూలముగా యుండుటచేతను, కమ్యూనిష్టురాజ్యములలోనే, కర్షకుల బీదరికమును, నిరుద్యోగమును, పోయి వారు ఘోరముగా పీడింపబడుచు, దుర్భరమగు కన్నులను పనులుచేయు పిశాచములనుండి విముక్తులైయుండుటచేతను చైనాలోని కర్షకులెల్లరును కమ్యూనిష్టుల కనుచరులైయున్నారు. అందువల్ల ముందువైపు కమ్యూనిష్టులతోను, వెనకవైపు తమ రాజ్యములోని కర్షకులతోను, పోరాడవలసిన దుస్థితి చాంకేషేకు పటాలములకు వాటిల్లినది.

కమ్యూనిస్టుల ప్రబోధము

ఇక, కమ్యూనిష్టుల నెదుర్కొనుటకు పంపబడు పటాలములందే తమదేశమును, విదేశ సామ్రాజ్యస్తుల వశముచేసి, తమదేశపు ప్రజలను, కమ్యూనిష్టులపై నాడు పోరాటము సల్పుటలో చాంకేషేకు యొక్క దేశద్రోహమునూర్చి, తీవ్రమగు యశాంతి కల్గెను. ఇది గాక, కమ్యూనిష్టులు, తమ్ము నెదుర్చవచ్చిన సైనికులను పిలచి, "సోదరులారా! మీరు పెద్ద భూస్వాముల పక్షమున యేల పోరాడెదరు? మేము బీద కర్షకులము, బీదకార్మికులము. మీయొక్క శ్రేయమునకై పోరాడుచున్నాము, భూమి యంతయు, కర్షకులకును, సైనికులకే చెందుగాక! శిస్తు లీయవద్దు! పన్ను లీయవద్దు! ఋణము తీర్చవద్దు! సోదరులారా! మా పక్షమునకు రండు! మీ తుపాకులను, మీ తోటాలను తీసికొనిరండు. విప్లవమునకై పోరాటము సల్పుడు" యని బిగ్గరగా చెప్పుచుండిరి. దీని కలనాగే చాల సార్లు చాంకేషేకు సైనికులు వారిపక్షమువీడి, కమ్యూనిస్టులతో చేరుచుండిరి. యెన్నియో పటాలము లీవిధముగా, చాంకేషేకు పక్షము వీడి కమ్యూనిష్టుల పక్షము చేరినవి. దీనివలననే కమ్యూనిష్టుల తుపాకులకు చాంకేషేకు భయపడుట లేదనియు, యీ కమ్యూనిష్టుల తీవ్ర ప్రచారమునకే మిక్కిలి భయపడుచుండినట్లు తెలియుచున్నది.

ఇది యిట్లుండ, కమ్యూనిష్టు సేనలు ప్రకటించిన ధైర్య సాహసములు లోక విదితములనియును, నెపోలియను సేనలతరువాత, లోక మిట్టి ధైర్యసాహసములుగల సేనలను జూచియే యెరుగదనియు, కమ్యూనిస్టులకు ప్రతికూలురుగ యుండువారలే జెప్పియున్నారు. యిట్టి ధైర్య సాహసములే తిరిగి, స్పెయిను యుద్ధరంగమున, మేడ్రిడు సంరక్షించిన యంతర్జాతీయ పటాలములు లోకమునకు జూపగల్గినవని మనకు తెలియుచున్నది. యీ స్పెయినులోని పోరాటమునకును, చైనాలో యిప్పుడు జపానువారు యవలంబించు విధానముయొక్క ఫలితముగాగల్గిన పోరాటమునకును చాల పోలికలున్నవి.

యిక బూర్జువా పత్రికలలో కమ్యూనిస్టుసేనలన్నియు భగ్నమయినవనియును, కమ్యూనిజముయొక్క బీజాంకురములన్నియు, పూర్తిగ నాశనమయ్యెననియు ప్రకటింపబడినది.

కమ్యూనిస్టులు కేవలము బందిపోట్లనియును, యీ బందిపోట్ల యొక్క బాధలనుండి విముక్తిచేయుటయే, జపానువారు చైనాను యాక్రమించుటలో సంరక్షణార్థమై చేయుచున్న మహాత్కార్యమని యు ఆలోచన లేని బూర్జువా యనుచరులు జెప్పు పల్లవి. నాగరికతను నిలువబెట్టుటకు అబిసీనియాను యాక్రమించెను ముసోలినీ. స్పెయినులో ప్రభుత్వమే లేదనియు అక్కడ ప్రభుత్వమును స్థాపించుటకు, తాను పాటుపడుచుంటినని మూ చెప్పి ప్రత్యేకముగా ఫాసిస్టు పటాలముల బంపి, స్పెయినును యాక్రమించుచు, యీ ఘనమగు నాగరికతను నిలువబెట్టి, కమ్యూనిస్టులనుండి, స్పెయినును రక్షింపగోరుచున్నానని జెప్పినవాడుగాడె యీ ముసోలినియే. ఈ యుదాహరణముల వలన, యీ బూర్జువా వార్తలును, బూర్జువా వాదములును యెట్టి యాధారములు గల్గియున్నవో వేరుగ జెప్ప బనిలేదు.

జాతీయ ప్రభుత్వ దాడి

కాని కమ్యూనిస్టులు గాని కమ్యూనిస్టు పటాలములు గాని భగ్నములు కాలేదు. 1931వ సంవత్సరము నవంబరు 7 వ తేదీన ప్రథమచైనా సోవియటుకాంగ్రెసు జరగెను, యీ కాంగ్రెసులో సోవియటురాజ్యముల రాజ్యాంగము, నిర్ణయింపబడెను. వారి యాశయములు, చట్టములును, నిర్మింపబడెను. సోవియటు చైనా రాజ్యము సుస్థిరముగా స్థాపింపబడెను. ఇది యిట్లుండ జపాను చైనాదేశమును క్రమముగా యాక్రమించుచునే యుండెను. చాంకేషేకు జపానువారి నెదుర్చుటకుముందు దేశములో శాంతిని యైకమత్యమును నెలకొల్పవలెననిన, మొదట కమ్యూనిస్టులను వారిరాజ్యమును యంత మొందింప జేయవలెనని జెప్పెను అట్లుగాక, మొదట జపాను నెదుర్చువిధానము కేవలము కమ్యూనిస్టుల పద్ధతి యని చెప్పుచుండెను. దీనివలననే, చైనాలో జపానునకు వ్యతిరేకముగజేయబడు ప్రచారమును యాందోళనను, కమ్యూనిజమని బూర్జువాపండితులు చెప్ప మొదలిడిరి. ఇక యీకమ్యూనిస్టులను, యెదుర్కొని వానిని యోడించుటలో చాంకేషేకు ఎట్టి విజయముగాని పొందలేదు. అందువలన 1932 లో చాంకేషేకు పదిలక్షలమంది సైనికులను జతపరచి, యీ కమ్యూనిస్టు రాజ్యములపై దండువెడలెను. సోవియటు గ్రామములపై విరివిగా బాంబులు వేయజొచ్చిరి. దీనివలన సోవియటుప్రభుత్వమువారు రొక్క-జిల్లాను విడిచిపోయిరి. కమ్యూనిస్టు సేనలలో కొన్ని షెనువాన్ రాష్ట్రములోనికి జొచ్చిరి. వీరా రాష్ట్రమునకు రాగానే, అచ్చట కర్షకులు యీ కమ్యూనిస్టు సేనలకు స్వాగతమిచ్చిరి. అందు మూలముగా షెనువాన్ రాష్ట్రముగూడ ఎట్టిజయము కాని చేకూరలేదు.

1933 లో చాంకేషేకునకు యింతకన్న గొప్పదండయాత్రకు తన కట్టుబాట్లొనర్చెను జర్మనీనుండి ఫాసిస్టు సైనికోద్యోగులను, అమెరికానుండి తెచ్చిన ఋణమువల్ల కొన్న జపాను యుద్ధసామగ్రియు అమెరికానుండి అప్పుచేసి నిర్మించిన విమానములను, జతపరచి,యీదండయాత్ర ప్రారంభించెను. యీదండయాత్రవలన కమ్యూనిస్టు రాజ్యము యస్తమింపలేదు, క్షీణించలేదు.

1934 జనేవరిలో రెండవచైనా సోవియటుకాంగ్రెసు జరగెను. యీ కాంగ్రెసులో చదువబడిన రిపోర్టులవలన సోవియటు రాజ్యముయొక్క యాధిక్యతయు, విజయమును మనకు తెలియగలదు. ఈ రాజ్యములలోని ప్రజల యార్థిక సౌఖ్యమును వీరలకుగల విద్యావసతులును, ప్రజలలో యత్యంతజ్ఞానోదయమును, యుత్సాహమును మనకు తెలియుచున్నది. సహకారసంస్థలు చాల విరివిగా స్థాపింపబడి, దినదినాభివృద్ధి నొందుచున్నవి. ప్రజలయొక్క యాకటిబాధ తీర్చబడినది. బ్యాంకులు స్థాపింపబడినవి. బ్యాంకులు నోట్లు జారీచేయుచున్నవి. యీ ప్రభుత్వమువారు వెండినాణెములు తమ టంకసాలలో తయారుచేసి చలామణీ చేయుచున్నారు. యీ నాణెములపై కమ్యూనిష్టు చిహ్నములగు

(మిగతా 15 వ పేజీలో)

దేవుళ్ళ పుట్టుపూర్వోత్తరాలు.

(5 వ పేజీ తరువాయి)

చేస్సునూ నమ్ముతారు. పురాణం శాస్త్రులువారిని నమ్ముతారు. సన్నా నమ్ముతారు. మన వాళ్ళల్లో వుండే గట్టిచిక్కు యిదే — ఈ భావ దాస్యత ఇంకా ఎన్నాళ్ళు? ఒక స్థిరబుద్ధికి రావడం ఎప్పుడు? ఈ ప్రశ్న మన పెద్దలకు — బాగా చదువుకొన్నవారికి.

వీళ్ళు యింత దుస్థితిలో వున్నారని నేను ఎన్నడూ అనుకోలేదు. వాళ్ళ ఉద్దేశం ఎంతసేపూ ప్రపంచాన్ని వెనక్కు తీసుకు పోదామనే. అట్లాంటివాళ్ళను తిరిగి స్కూళ్ళకు పంపిస్తే—

వీళ్ళకు పాఠం చెప్పేముందు ఈ "దేవుడు" వ్యాధి ప్రపంచంలోకి ఎలా జొరబడిందో కొంచెం తర్కించి చూడడం అవశ్యకం— అంటే దేవుడి పుట్టుపూర్వోత్తరాలు కనిపెట్టాలి — దేవుడు అనే ఆసామి ఉన్నాడా లేడా అని పెనుగులాడేకన్న ఈ దేవుడు ఎక్కడ నుంచి ఊడిపడ్డాడో పరిశోధించడం తెలివితేటలైన పని. ఆ పరిశోధన చేసిచూస్తే దేవు డున్నాడా లేడా అనే ప్రశ్న మరివుండదు—అందుచేత ఆ దేవుడి పుట్టుపూర్వోత్తరాలు తీసి చూద్దాం—

ఆదిమానవుడికి ప్రకృతి అంతా విచిత్రంగా తోచింది. ప్రపంచ మంతే ఏదో మాయ క్రింద భావించాడు. నిప్పు వేడిగా వుండటం, నీళ్ళు చల్లగా వుండటం, మంచు అధిక శీతలంగా ఉండటం, నదులు ప్రవహించడం, ఆకాశంమీద మేఘాలు సంచరించడం, ఉరుములు, మెరుపులు, వాన, తుపాను, సంధ్యారాగము, రాత్రి, పగలు—యిల్లాంటి ప్రకృతి లక్షణాలన్నీ అతడికి వింతగా, అర్థం కానట్టుగా, క్లిష్టంగా తోచాయి. వీటిని గురించి ఆలోచించిన కొద్దీ అతగాడికి తెలుసుకోవాలనే కోరిక, ఆవేశం, పట్టుదల, ఎక్కువ కాజొచ్చాయి. కాని అప్పుడు మానవ పరిస్థితులు వేరుగావుండేవి. మానవుడి మెదడు ఇంకా బాగా అభివృద్ధి కాలేదు. బుద్ధివికాసం అట్టే వుండేది కాదు. అందుచేత ఆ ప్రకృతి సమస్యను విడగొట్ట లేక పోయాడు. ఆ విషయం తన సంతతివారికి విడిచిపెట్టి తను మాట్లాడక ఊరుకున్నా తీరిపోయేది. కాని తాతగారి లక్షణాలు ఎక్కడకు పోతాయి? అపళంగా "దీని సంగతి యిది కాదు. దీని కంతకూ ఈ ప్రకృతి వైచిత్ర్యాల కన్నిటికీ ఎక్కడో "కీలు"వుంటుంది ఆ కీలు త్రిప్పే ఆసామీ ఒక డుంటాడు. వాడే ఈ జగత్తుకంతకూ నాథుడు" అని ఒక గంతు వేశాడు. శాస్త్ర పరిశోధనలలో జయం పొందిన ఆర్కిమిడీసుకు మల్లే. ఆ గంతే గొప్ప పొరపాటుగా— మానవ ప్రపంచాని కంతకూ గొప్ప ద్రోహంగా, ఎన్నడూ విడని సమస్యగా పరిణమించింది. ఒక్క ముక్కలో "దేవుడనేవాడు ఈప్రపంచపు వ్యవహారాలనన్నిటిని నడిపిస్తున్నాడు" అనేశాడు. ఆ విషయం తన దిగువ సంతతికి అందిచ్చాడు. వాళ్లూ దాన్ని నమ్మేరు. "ఎవడో ఉండే వుంటాడు పైన. లేకపోతే ఈ నిప్పు ఇలాగ వేడిగా వుండటమేమి? ఈ నీళ్లు ఇలాగ చల్లగా వుండటమేమి?" అని వితర్కించుకొని దేవుడనే ఆసామీ వున్నాడని స్థిరపరచారు. ఈ ప్రకృతి ప్రపంచం—యివన్నీ కూడా అతగాడి రూపాలే - ఏజంట్లే - నని భావించారు. ఆ ప్రకృతి శక్తులు అన్నీ తమకు నిత్యజీవితంలో చాలా ఉపయోగిస్తూవుండడం చూచారు. త్రాగే నీళ్ళు అన్నం వుడికించుకునే నిప్పు, వర్షాన్నిచ్చే మేఘాలు—ఇవన్నీ తమ (మానవుల) శ్రేయస్సుకొరకే పని చేస్తున్నవని గుర్తించి అవి నిజంగా దేవుడిరూపాలే గనుక వాటికి కృతజ్ఞత చూపించడం అవసరం అని గుర్తించి వాటిని ప్రార్థించడం, ఆరాధించడం మొదలు పెట్టారు. కొంతమంది నానుకరణాలుకూడా చేశారు కొన్ని కొన్ని ప్రకృతిశక్తులకు. ఇంకా కొంతమంది ఛాందసులు బయలుదేరి చూనివచ్చి నట్టుగానే ఇంకా అనేకమంది దేవుళ్ళు వున్నారనిచెప్పి, వారికి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు—యిత్యాది పేర్లు పెట్టి ధ్యానించ సాగారు. ఆ విధంగా ఆది మానవుడి ఒక్క పొరపాటుతో— దేవుడనే శబ్దం చిరస్థాయిగా ప్రపంచంమీద నిలిచిపోయి అనేక వాగ్వివాదాలకు, అనేక వాదవివాదాలకు అనేక విపరీత పరిస్థితులకు, అనేక అమానుష కృత్యాలకు మూలంగా నిలిచివుంది.

రానురాను ఆ దేవుళ్లు పెరిగిపోయారు. నాదేవుడు గొప్పవాడంటే నా దేవుడు గొప్పవాడని వాదాలు హెచ్చాయి — ఎవరిగొప్ప వాళ్లు వెల్లడి చేసుకుందుకు మతాలు స్థాపించుకున్నారు. విగ్రహాలు, విగ్రహారాధన సాగించారు. దేవుళ్ళ పరువుప్రతిష్టలు నిలబెట్ట డానికై అనేకమంది కొట్లాడారు. అనేకమంది చచ్చారు. అనేకమంది ఆస్తులు సంపాదించుకొన్నారు. అనేకమంది మోసం నేర్చారు.

ఆతర్వాత ఇంకా విచిత్రమైన ఛాయిలు బయలుదేరారు—ఎవడో ఒకఆసామీని ఎలక్షనుకు నిలవబెట్టినట్టుగా నిలబెట్టేది— "ఇతగాడు దేవుడిఅవతారము" నేది—అపళంగా ఆఆసామీని పెద్దగా కొంత నెక్కించేది—వీళ్ళు బ్రతికివున్న దేవుళ్ళు-అంటే ప్రపంచం చవిచూచిన వాళ్ల-అల్లా, క్రైస్తు రాముడు, కృష్ణుడు- యిత్యాదులు.

వీళ్లు దేవుళ్ళవడానికి కారణం వీళ్ళలో ఏవోగొప్ప సుగుణాలుండేవి-రాముడు గొప్ప పితృవాక్యపరిపాలకుడట-చాలా సుగుణశీలుడు, న్యాయశీలుడు, ధర్మశీలుడు-యిట్లా ఒక క్యేటలాగు; క్రైస్తు మానవలోకాని కంతకూ మహోపకారం చేశాడంటారు కొందరు. మా అల్లాను మించినవాడు లేడంటారు, ముసల్మానులు.

సరే, వప్పుకొందాం. వాళ్ళలో చాలాగొప్ప సుగుణాలే వున్నాయి. కాని ప్రపంచానికి ఏమిటి ప్రయోజనం? రాములవారు పితృవాక్య పరిపాలకులైతే నీకూ నాకూ ఏమైనా ఒఱ్ఱేవద్దదా? ఆయనగారి భార్యకే దిక్కు లేకపోయింది. అడవికి నెట్టేశాడు-సామ్రాజ్యవాదానికి ముఖ్యచిహ్నమైన సి. ఐ. డి. విధానం రాములవారి కాలంలోకూడా వుండేదని రామాయణం ఘోషిస్తోంది. ఆకాలంలో ఫేసిజంకూడా వుండేదని నాఅభిప్రాయం. కడుపుతూవున్న యిల్లాలిని అతిఘోరంగా భీకరారణ్యంలోకి తరిమివేశాడంటే ఆ ఆసామి ఎంత ఫేసిస్టు అయివుండాలి?

మనవాళ్ళలో వుండే చిక్కు యిదే. ఎంతసేపూ సుగుణాలూ ఏకరువు పెట్టే వాళ్ళేగాని రెండోవైపు—తప్పులు ఎవళ్ళూ విమర్శించరు.

ఈవిధంగా—చరిత్రకారుడి పక్షపాతబుద్ధివలన. తీరుమారైన చరిత్రవలన-ఏయుగంనాటి సాధారణ మానవుడో కొన్నియుగాల అనంతరం దేవుడుగా భావించబడటం మనం కళ్ళారా చూస్తూవున్నదే....

ఈ లోపం చరిత్రకారుడిది—అంటే ఆనాటి చరిత్రకారులు-వాల్మీకి, యిత్యాదులది.

అలెక్కని చూచినట్లైతే ఇంకొక శతాబ్దం నాటికి గాంధీగారు అనేక దేవాలయాలలో దేవుడుగా వెలసి వుంటాడు-ఇప్పుడే పరిస్థితులు అట్లావున్నాయి.

గాంధీగారి, తర్వాత సి. ఆర్.కు ఒకగుడి, సాంబమూర్తికి ఒకగుడి, ముస్సోలినీకి ఒకటి, హిట్లరుకు ఒకటి....యిదీ తరహా:

ఇప్పుడు పూర్తిగా అవగాహన అవుతుంది దేవుడంటే ఏమిటో. ఆదిమానవుడు తన తెలివితక్కువ వలన పొందిన భ్రమ— ఆతర్వాత "చరిత్రకారుడి" మోసం—

ఈరెండుకలిసి దేవుళ్ళను సృష్టించాయి.

ఆదేవుళ్ళను తీసుకువచ్చి, గుళ్ళలోవుంచి, ఆరాధించి వాటిసాక్షిగా అనేక ఘోరకృత్యాలు చేయడంలో ఎంత ఔచిత్యంవుందో ఎవరికివారు ఊహించుకోవచ్చు.

అందుకే "Man is an ape upside down" అన్నాడు చెస్టర్టన్

ఈదేవుళ్ళను సృష్టించే వాళ్ళను చూస్తే నాకు చాలా భయం-కొన్నాళ్లపోయాక నువ్వు, నేను, మద్దూరి అన్నపూర్ణయ్య గారు కూడా దేవుళ్ళం అయిపోతామేమో....

గుడ్ హెవెన్స్!

అహింసావాదుల దౌర్జన్యం

సంఘారి ప్రసాదరావు

(గతసంచిక తరువాయి)

2 వ పోలింగులోని కొక్కిలిగడ్డ, భొబ్బర్లంక, ఆ ముదాల్లంక గ్రామములను 10 మైళ్ళదూరమున వున్న బండిలోయ గ్రామమునందలి పోలింగుస్టేషనుకు కల్పిరి. కృష్ణానదికి నావల ఈ గ్రామాలు, అవతల 10 మైళ్ల దూరంలో పోలింగుస్టేషనుకు. కృష్ణకు దక్షిణమున వున్న అవనిగడ్డ, కొత్తయడ్లంక మొ॥ గ్రామాలను ఉత్తరమున వున్న నాగాయతిప్ప పోలింగు లో చేర్చారు.

600 ఓట్లుగల్గి దగ్గర దగ్గరగా మైలుదూరములో భట్ల పెనుమర్రు, పెదపసగల్లు గ్రామములుండగా 4 మైళ్ళదూరంలో ఉన్న చినముత్తేవిలో భట్లపెనుమర్రును కల్పిరి. 200 ఓట్లుకల్గిన కాజ గ్రామమును మార్గసౌకర్యములులేక 5 మైళ్ళదూరంలోవున్న మంత్రిపాలెం పోలింగులో చేర్చిరి. కాని 5 వ తేదిని కాజ భట్ల పెనుమర్రు గ్రామస్థులచే తమకే ఓట్లు యిస్తామనే వాగ్దానము చేయించుకొని పోలింగులను మార్చిరి.

681 ఓట్లు గల్గి ఒక అభ్యర్థికి నివాసస్థానమైన ఘంటసాల గ్రామమును 1 మైలు దూరంలో ఉన్న పోలింగులో కల్పి, మైళ్ళదూరంలో వున్న మార్గసౌకర్యములేమీ లేకుండా 7 ఓట్లుగల ఉండ్రప్రూడి పోలింగులో కల్పిరి.

414 ఓట్లుగల కవుతవరం గ్రామమును 5 కాల్వలు అడ్డంగావుండి మార్గసౌకర్యములులేక 7 మైళ్ళదూరంలోవున్న 123 ఓట్ల ముక్కొల్లు పోలింగుతో జతపర్చిరి.

240 ఓట్లుగల పెదపసు 4 మైళ్ళదూరంలో ఉన్న 151 ఓట్ల సంగమూడి పోలింగులో చేర్చిరి. కాని ఏమి అభ్యర్థికి ఓట్లు యిస్తారని వాగ్దానం చేసిన 24 వ తేదీన పెదపసు ప్రత్యేక పోలింగును ఏర్పాటుచేసిరి.

8 వ నియోజకవర్గంలోని 1 వ పోలింగులోని 5 గ్రామములకు పోలింగు సెంటరు యివుండగా ఒక చింతలపాటి వారి కనుకూలమైన పెంజండ్రలో పోలింగు ఏర్పాటు చేయబడినది.

457 ఓట్లుగల్గిన తమిరిశ గ్రామమును మార్గసౌకర్యములులేని 410 ఓట్ల నందివాడ పోలింగులో జేర్చబడెను.

కొల్లేటి కోటలో 100 ఓట్లు ఉండగా 51 ఓట్లుగల పల్లెవాడలో పోలింగు సెంటరు ఏర్పాటు చేయబడెను 202 ఓట్ల ఉనికిలిని దూరమైన 25 ఓట్ల సంగనపూడి పోలింగులో వేశిరి.

పోలుకొండలో 212 ఓట్లు వుండగా 4 మైళ్ళదూరమునుండి బండిపోవుటకు కూడా వీలులేని కుదరవల్లిలో పోలింగు ఏర్పాటుచేసిరి. పై 202 ఓట్లుగల ఉనికిలి ఈ 212 ఓట్లుగల పోలుకొండ 1 మైలుదూరంలోనే యున్నవి.

చెప్పదలుచుకుంటే ఇంకావున్నాయి. కాని భారతమంత అవుతుంది ఈ సొద.

కాని పశ్చిమ గోదావరిలో ఈ కృత్రిమ వ్యాపారమున్నదా? సత్యము, అహింసల పేరిట ఇట్టిదౌర్జన్యము, మోసము జరుపబడినదా?

పశ్చిమగోదావరిలో ప్రతి 50 ఓట్లకు ఒక పోలింగు స్టేషనును ఏర్పర్చారు. పోలింగు ప్రదేశాలను ముందుగా ప్రకటించారు. "ఇండియాలో ఎక్కడనులేని అపూర్వదృశ్యం" పశ్చిమకృష్ణాలో 21 మంది తీవ్రవాదులు పోటీలేకుండా రావటం మొదటిది; ప॥ గో॥లో 50 ఓట్లకు పోలింగు సెంటరును ఏర్పర్చటం రెండవది. సోషలిస్టు-న్యాయం నిర్మాణ కుశలత ఇట్టిది" నిరుటి జిల్లా కాంగ్రెసు కమిటీసెక్రటరీ గారయిన కానూరు బలరామయ్యగారి పేరు కృష్ణాజిల్లాలో ప్రసిద్ధం, వారిత్యాగదీక్ష, స్వాతంత్ర్యకాంక్ష, సేవాపరాయణత్వం అందరూ అనుకరించవగినవి. కాని శ్రీ తూర్పుకృష్ణాకాంగ్రెసు పెత్తందార్ల కండ్లకు వారు కట్టుకట్టడుతకోటలు మాంచెస్టరు మిల్లు గుడ్డలుగా కన్పించినాయి, కాబట్టి వారు కాంగ్రెసుఎన్నికలకు పోటీ చేయుటకు వీలులేదు. పాపం! బలరామయ్యగార్ని వేలెత్తిచూపిన పెత్తందార్లు ఆవేలితో తమకంటినే పొడుచుకున్నారు. వచ్చి యాక్షనును తట్టుకోలేక రెండురోజుల పిమ్మట వారిని ఖద్దరు దీక్షపరులుగానే అంగీకరించారు.

"ఇండియాలో ఎక్కడాలేని అపూర్వదృశ్యం" మాడదని ఇక్కడ ప్రత్యక్షం. 19 మంది తీవ్రవాదుల నామినేషన్లు ఖద్దరుకట్టటంలేదనో, ఏవో ఒకవంకపై త్రోసివేయబడ్డాయి. "అపూర్వదృశ్యం" చూడండి మీరుకూడా.

జిల్లాకాంగ్రెసు కమిటీసభ్యుడగు కంచెర్ల వెంకట్రామయ్యగారి గుళ్ళపల్లి పురుషోత్తంగారి నామినేషన్లు ఖద్దరు ధారులు కారను దొంగనెపంతో త్రోసివేసిరి.

9 వ నియోజకవర్గానికి 6 గురు పోటీచేసారు, ఇద్దరినామినేషన్లుతప్ప తక్కినవారివి నిరాకరించారు ఇద్దరిలో ఒక నామినేషనును ఉపసంహరించుకోగ కోరగా వారు నిరాకరించినందున అరాత్రి వారి నామినేషనుకూడా రద్దుచేయబడింది.

14 వ నియోజకవర్గం 3 నామినేషన్లు, ఒకరిని ఖద్దరుకట్టకనే దొంగనెపంపై త్రోసివేశారు. మరునాడు రెండవవారి నామినేషనును నిరాకరించారు. ఆవిధంగా తమ అనుచరుడగు అట్లూరి బాలక్రిష్ణయ్యగార్ని పోటీలేకుండా తెచ్చారు.

16 వ నియోజకవర్గం 4 రు అభ్యర్థులు, ఒకరు సత్యాగ్రహోద్యమంలో జైలుకు వెళ్ళివచ్చిన కోడూరు వెంకట్రామయ్యగారు. వీరూ, మరియిద్దరూ ఖద్దరుధారులు కారను దొంగనెపంతో వీరి నామినేషన్లు నిరాకరించబడ్డాయి. పోటీలేకుండా గెలిచిందెవరు కౌన్సిలుఎన్నికలలో కాంగ్రెసుకు వ్యతిరేకంగా పనిజేసిన ఎర్నేని నాగేశ్వరరావుగారు.

ఈ నాటకమంతా ఎట్లాజర్గింది? స్క్రూటినీ సమయంలో అభ్యర్థులెవరూ ఆక్షేపించలేదు. ఎన్నికోద్యోగియే తనకు పిటీషన్లు వచ్చినవనియు, తానునమ్మితినని పల్కినాడు. ఏవీ పిటీషన్లుచదివి వినిపించండి అంటే పిటీషన్లు బయటపెట్టుకో నక్కరలేదు, కావలసివస్తే రాష్ట్రకమిటీకి అప్పీలుజేసుకోండి అని జవాబు దీన్నీ ఇంగ్లీషులో "పెనంమీదనుంచి మంటలోకి దూకటం" అంటారు.

అప్పీళ్లగతి ఏమైందా? "మేమేమిాజోక్యం కల్గించుకోము"— పశ్చిమగోదావరి, పశ్చిమకృష్ణాలవిషయంలోగాక-యని రాష్ట్ర పెత్తందార్ల న్యాయమైన తీర్పు!

పశ్చిమ గోదావరిలో ఈ అన్యాయిత్యాలు జరుగలేదే? ఏరెండో కాంగ్రెసు ప్రతికూలుర నామినేషన్లు తక్క తక్కినవన్నీ అంగీకరింపబడ్డాయి.

తూర్పుకృష్ణా కాం॥ క॥ కార్యదర్శి శ్రీచలసాని నాగభూషణంగారు తమపేరుతో కృష్ణాపత్రికలో ప్రకటింపించుకొన్న వ్యాసంలోని నిజానిజాలు పైవిషయాలవల్ల బోధపడగలవు. వారికే ధైర్యముంటే విచారణ సంఘాన్ని— ఋజువర్తనులైనవార్ని కూడిన సంఘాన్ని-ఏర్పరిస్తే వారి [illegible]వన బయటపడుతుంది ఇదిగాంధి శిష్యులమని బింకాలు కొట్టే సత్యసంధుల, అహింసావాదుల సత్యసంధత, అహింసాప్రవర్తన [illegible]?

ఆదర్శజ్యోతి

(4 వ పేజీ తరువాయి)

ప్రభాకర్:—హల్లో; గుడ్‌మార్నింగు లీలా, నీ ఉత్తరము నిన్ననే చేరినది. అంటూ షేక్‌హ్యాండ్ చేశాడు,

లీల మెల్లిగా బండి దిగింది. ప్రభాకర్ మూట, పెట్టె దింపి, తాను పెట్టె, మూటను లీల తీసుకొని పోతున్నారు. ఓమారు లీల తిరిగి చూచింది. ఏముంది? వికసిత ముఖంలో లేత పెదవులపై చిరునవ్వు చిందులాడుతుంది. దుష్టసంఘపు మాయనుంచి, ఆదర్శప్రియుని కలుసుకొని ఆనందాబ్ధిలో ఓలలాడుతుంది.

★

తెల్లవారింది. దాసి తలుపుతెరచి చూచింది. ఏదీ లీల? లేదు. వెళ్ళి రావుతో చెప్పింది. అందరూ వచ్చి వెదికారు. ఎక్కడాలేదు లీల. గదిలో చూచారు; టేబిల్‌పైన లీల స్వహస్తముతో వ్రాయబడ్డ లేఖ.

"నాన్నగారూ!

అధర్మం, అక్రమము, అసత్యం, మోసం, ద్వేషం, దురాశ మొదలగు దుర్గుణాలతో నిండియున్నది నేటిసంఘము. మానవుడు ఎవరో కొందరి యొక్క సౌఖ్యానికి సుఖవిలాసాలకు సృష్టించబడ్డ పనిముట్టు గాదు. నేనేకాదు మరెవరైన హృదయమంటూ ఉన్న మానవుడు ప్రస్తుతజీవిత విధానాన్ని నిర్మూలించడానికి ప్రయత్నిస్తాడు. తిరుగుబాటు చేసి తీరాలి.

ప్రజలను విభజించి, ఒకళ్ళమీద ఒకళ్ళను ఉసికొల్పి, లాభాలకోసం, సంఘాన్ని చిందరవందరజేసి, మానవుల భౌతికంగా, నైతికంగా దాస్యకూపములో ద్రోసే, ఈ ధనికవాదాన్ని ధ్వంసముజేస్తాము. స్వంతఆస్థి అనేదానిని ఉంచనివ్వము.

ప్రపంచ మానవాధారభూతులైన కార్మికులే, సర్వసౌఖ్యాలు అనుభవించాలి అధికారమంత కష్టజీవులదే. ఉత్పత్తిసాధనాలన్న ప్రజలవే. కష్టపడి పనిజేయాలి, ప్రతిఫలముతో సౌఖ్యాలు అనుభవించాలి. ఇదే మా ఆదర్శము.

దేశంలో పీడింపబడుతున్న కార్మిక కర్షకసేవ జేయుటే నా పరమావధి. బానిసత్వమనే సంకెళ్ళను ఛేదించాలి. అందుకనే ఆ ఆదర్శాలకు అహుతై పోతున్నాను. లీలను మరచిపొమ్ము.

ఇట్లు
ప్రియమైన నాన్నకు
కడసారి వందనములతో
"లీల"

వీరులపాడు కూలీసంఘం

మా గ్రామమునకు షుమారు 6 నెలల క్రిందట కామ్రేడ్స్ జె. రామలింగయ్య, పి. సుందరయ్య, వచ్చినారు. అప్పటినుండి కూలీ, రైతుసంఘాలలో పనిజేశారు. చుట్టుపట్ల అన్నిగ్రామాలు తిరిగారు. కూలీసంఘాలు, రైతుసంఘాలు స్థాపించారు. రాత్రి పాఠశాలలు, ఉపన్యాసముల ద్వారా విషయములు బాగా తెలియజెప్పారు. కూలీ, రైతులలో ప్రబోధము కల్గించి. మాయూరి కూలీ, రైతులకు గూడ వారు వచ్చిన పిదప రాజకీయ జ్ఞానం బాగుగ కల్గినది.

భూస్వాములకు యిది గిట్ట లేదు. వారి పలుకుబడి తగ్గెను. వారి యధికారము వెనుకటిరీతిగా సాగుట లేదు. కర్రపెత్తనం సాగించే రోజులు వెనుకబట్టినవి. కాబట్టి లోలోన మండిపడిపోవుచుండిరి. క్రోధాలు పెంచుకొనిరి. కామ్రేడ్సును కొట్టుటకు ప్రయత్నాలు చేయసాగిరి. కుట్రలు వృద్ధియైనవి.

కూలీలు సంఘము పెట్టుకున్న పిదప వారియందున్న చిన్న చిన్న దోషములు సైతము రూపు మాసిపోయినది. ఎవరిపనులు వారు చక్కగ చేసుకొనుచుండిరి. గ్రామములోని రైతులు చాలమంది కూలి సంఘమువారిపై ఆదరాభిమానములు కల్గియుండిరి.

తిట్టుట, కొట్టుట మానాలి యని కూలిసంఘవారు కోరిరి. మూడువంతుల రైతులకుపైగా వొప్పుకొనిరి. భూస్వాములు మాత్రము తమ పెంకెపట్టును వదల లేదు.

ధనప్రభావంచేత కొద్దిమంది పేదరైతులను దగ్గరకు చేరదీసిరి. వారిని కూలిసంఘం పైకి పురికొల్పుచుండిరి. పాపం వారు సంగతి తెలుసుకొనకుండిరి. ధనికులు వెనుకనుండియే నాటక మాడించుచుండిరి.

ఒక రైతు వొక కూలివానిని కొట్టెను. కూలీసంఘం వారు అది అక్రమమని తెలియజేసిరి. భూస్వాములచేతులలోనున్న ఆరైతు లెక్కచేయలేదు. మరల యింకొకరైతు వొక చిన్నపిల్లను చావచితుక మోదెను. కూలిసంఘం కార్యదర్శి యిది అన్యాయమని తెలియజేయబోయెను. రైతు తూలనాడెను. అంతట ఆరైతుమీద కేసు పెట్టబడినది.

3 వ సారి మరల యింకొక కూలివాడు కొట్టబడెను. కూలిసంఘంయొక్క సాధారణ సమావేశం జరిగింది. 13 వ తారీఖున ఉదయం సుమారు 8 గంటలకు కూలీలందరును తమ అసమ్మతి తెల్పుటకుగాను ఒకరోజు పనులు మానివేయుటకు తీర్మానించుకొనిరి. భూస్వాముల కోపకారణము మరింత యెక్కువాయెను. షుమారు 6 గంటలకు కామ్రేడ్సు రామలింగయ్య, సుందరం సాధారణ సమావేశంలో మాట్లాడి తిరిగి వచ్చుచుండిరి. ఇద్దరే వుండిరి. ఒక కూలివానితో మాట్లాడుచుండిరి. అదనుకై వేచియున్న భూస్వాములకు సమయం చిక్కినది. ఒక్కసారిగా కలబడి చుట్టుముట్టిరి. కామ్రేడ్సుల యిద్దరను కొట్టిరి. గల్లంతు యైనది. పరుగునవచ్చి పోగైరి. కొట్లాట జరుగలేదు. కూలీలు శాంతముగ వెళ్ళిరి. భూస్వాములు చేసిన పనికి 13 సాయంత్రము కూలీ, రైతుసమావేశం జరిగింది. అందు భూస్వాములు జేసినపని అన్యాయం, అక్రమము, దుర్మార్గము అని తీవ్రముగ నిరసింపబడినది. ఇట్టిపనికి తలపడినవారి యిండ్లకు రెండు దినములవరకు యేపనులకును పోకుండవుండుటకుగాను తీర్మానించబడినది. రైతులు, కూలీలు సామరస్యముగా తగాదాలేకుండ వుండిరి. భూస్వాములు మాత్రము పట్టినపట్టు వదలక యేదియో ఆలోచించుచుండిరి. ఇదియంతయు నేనెఱిగినదనియు, నా కళ్లార జూచినదియు అయియున్నది.

పి. వి. సుబ్బారావు.
కార్యదర్శి
రైతు సంఘం.

శ్రీరామకృష్ణ గ్రంథాలయ
పంచమ వార్షికోత్సవము

ది. 15—1—38 తేదీ శనివారము మధ్యాహ్నము షుమారు 2 గంటలకు వల్లభనేని సీతామహాలక్ష్మమ్మగారితో శ్రీరామకృష్ణ గంథ్రాలయమువారు జాతీయగీతములు పాడుచూ నగరసంకీర్తనము చేసిరి.

ఆమె స్త్రీలకోరికపై శ్రీయుత రావులపాటివెంకటరెడ్డిగారి భవనమునందు స్త్రీల ప్రత్యేకసమావేశము గావించి స్త్రీవిద్యయందు స్త్రీలకర్తవ్యమునుగూర్చి విపులపరచి ఉపన్యసించిరి. యీ గ్రామమున మహిళాసంఘస్థాపన మొనరించిరి.

సాయంకాలం బహిరంగసభ జరిగింది. శ్రీయుత రామిరెడ్డి సుబ్బారెడ్డిగారు ఆమెదేశమునకును స్త్రీజనమునకును యొనర్చు సేవనుగూర్చి యెరుకపరచి అధ్యక్షత వహింప ప్రార్థించిరి.

గ్రంథాలయాధ్యక్షుడు రామిరెడ్డి వెంకటరెడ్డిగారు అధ్యక్షురాలికి స్వాగతపత్రము సమర్పించిరి.

మహారాజశ్రీ పామిరెడ్డి సుబ్బారెడ్డిగారు సభాప్రారంభకులుగానుండి గ్రంథాలయోద్యమావశ్యకతను గూర్చియు. విద్యా విధానమును గూర్చియు. యుపన్యసించిరి, అన్యదేశముల విద్యా విధానమునకును మన దేశమందలి విద్యావిధానమునకును గల భేదముల స్పష్టపరచిరి.

కార్యదర్శి జనాబ్ షేక్ శిలార్ సాహెబ్‌గారు గత సంవత్సర నివేదికను చదివిరి. అధ్యక్షురాలు గ్రంథాలయములు వాని సక్రమపోషణ. వానియందు స్త్రీలు పాల్గొనుట స్త్రీవిద్య హిందూ సంఘమందలి దురాచారముల సంస్కరణములగూర్చి గంభీరోపన్యాసము గావించిరి.

మహారాజశ్రీ తుమ్మల గోపాలకృష్ణయ్యచౌదరీ గారు తమ సతీమణితో విచ్చేసి స్త్రీ పునర్వివాహములగూర్చి యుపన్యసించిరి.

అధ్యక్షులకును, యుపన్యాసములకును, ప్రేక్షకులకునూ అభివందనములతో సభ ముగింపబడెను.

18—1—38. షేక్ శిలార్ సాహెబ్.
కాజ కార్యదర్శి.

జన్నూరు
మహిళా సంఘము

18—1—38 వ తేదీన శ్రీమతి బి. వెంకమ్మగారి అధ్యక్షతను గ్రామ మహిళా సంఘ కార్యనిర్వాహక వర్గం సమావేశమై ఈక్రిందితీర్మానాలు గావించింది.

(1) జిల్లాలో విరివిగా సంఘాలు స్థాపించడానికి ఏర్పాట్లు చేయవలెను.

(2) ప్రతి గ్రామములోను స్త్రీసంఘ నిర్మాణానికి కాంగ్రెసు యువజన సంఘముల వారి సహాయమును కోరుచున్నారు.

(3) కాంగ్రెస్ మంత్రివర్గమువారు వెంటనే పిత్రార్జితమందు స్త్రీలకుకూడా పురుషులతోపాటు సమాన భాగం యిచ్చునట్లు శాసించవలెను.

(4) విడాకులచట్టము (డైవోర్సు) అప్రవర్తన అనారోగ్యము, అసభ్యత మొదలగునవిగల పురుషులను విడనాడుటకు, కాంగ్రెస్‌ప్రభుత్వం వారిని శాసించవలసినదిగా కోరుచున్నాము.

ఇట్లు
ఇ. సూర్యకాంతమ్మ
కార్యదర్శిని.

దివితాలుకాప్రజలకు

విజ్ఞప్తి

యీనెల 25 వ తారీఖునుండి దివితాలూకా గ్రామాలలో స్త్రీలసంఘముల నేర్పాటుచేయుటకున్నూ, సభ్యురాండ్రను విరివిగా చేర్పించుటకున్నూ జిల్లాసంఘము విరాళములు వసూలుచేయుటకున్నూ జిల్లామహిళా సంఘముతరఫున ప్రచారముచేయ సంకల్పించితిమి గాన మాకు తగినంతసహాయ మొనర్పవలసినదిగా దివితాలూకా వాసులకు మనవిచేయుచున్నాను.

ఇట్లు
వల్లభనేని శీతామహాలక్ష్మమ్మ.
అధ్యక్షురాలు.

విజ్ఞప్తి

జిల్లాకాంగ్రెస్ సంఘములకు యెన్నికలు ఫిబ్రవరి 8 వ తేదీ జరుపబడునని నిశ్చయింపబడినది. ఆరోజు మంగళవారమగుటచే విద్యార్థులు, కార్మికులు, మొదలైనవారికి సెలవు దినము కానందున వోటుచేయుటకు చాలకష్టమగును. కాన యెలెక్షన్లు ఆదివారమునాడు జరుగునట్లు ఏర్పాటు చేయవలయునని జిల్లాకాంగ్రెస్ సంఘంవారిని కోరుచున్నాము.

సెక్రెటరీ,
విశాఖపట్టణ విద్యార్థిసంఘం.

నెల్లూరు
మండల యువజనసంఘము.

పైసంఘముయొక్క కార్యనిర్వాహకసభ ఈనెల తే 29 ది మధ్యాహ్నము 1—30 గంటలకు కార్యాలయములో జరుగును.

కార్యక్రమము :—

1. క్రొత్తగా సభ్యుల చేర్పించుటనుగూర్చి.
2. ఆర్థిక విషయము.
3. ప్రాథమిక సంఘములున్నచోట అధ్యాపకతరగతుల నేర్పరచుటను గురించి.
4. కార్యదర్శి తెచ్చు ఇతర విషయములు.

ఇట్లు,
రావి ఆదిశేషయ్య
ప్రధాన కార్యదర్శి.
21—1—38

చీనా జపాను యుద్ధాని పూర్వ గాథ

(11 వ పేజీ తరువాయి)

కొడవలి, సుత్తియు, చిత్రింపబడియున్నవి. వీరి బ్యాంకు నోట్లపై లెనిన్‌యొక్క పటము ముద్రవేయబడియున్నది. వీరిరాజకీయ నిర్మాణము, రష్యాదేశపు రాజకీయ నిర్మాణమును పోలియున్నది. వీరి రాజ్యము, కియాంగ్సీ పరగణాలో ముఖ్యభాగమును, ఫుకీనుభాగమును, ఫూకీన్‌లోని పడమటిభాగమును, హూనాన్, క్యాంటంగ్, హూపే కెన్‌సూ రాష్ట్రములలో కొంత ప్రదేశములోను విస్తరించి యున్నది.

కాని చైనాలో యీకమ్యూనిస్టు రాజ్యములను యంతరింపజేయుటకు కేవలము చాంకేషేకు మాత్రమే ప్రయత్నము చేయలేదు. యీసంయుక్తరాష్ట్రము, యింగ్లీషు, జపాను అమెరికా, ఫ్రాంసు, జర్మనీ, యిటలీ, మొదలగు దేశములవారును, కొమింటాంగు పార్టీయు సహాయము చేసినవి. కమ్యూనిజమును రూపుమాపి, నాగరికతను, సంరక్షించుటకు, యనుమిషతో యుద్ధము చేయుట నవీన రాజ్యాంగ విధానములలో నొకముఖ్యమగునది యైనది.

సామ్రాజ్య వ్యతిరేక ప్రచారము.

యీ విధముగ యన్ని సామ్రాజ్య దేశముల సహాయమువలన జరిగిన పత్తిడినుండి, తప్పించుకొనుట చైనా కమ్యూనిస్టుల ముఖ్యసమస్య యాయెను. కేవలము కమ్యూనిస్టుల యాధీనములో నడుచు రాష్ట్రములలోనేగాక చైనాలో యెల్లెడలను కమ్యూనిస్టులును, కమ్యూనిస్టుల సానుభూతిపరులుండిరి. చాంకేషేకు యాధిపత్యము క్రిందనుండిన దేశములో కమ్యూనిస్టు ప్రచారము యేమాత్రము సాగకుండుటకు ప్రభుత్వమువారు తీవ్ర నిర్బంధ విధానమును, యమలులో నుంచిరి. యిచ్చట యేమాత్రము ఉన్నతాదర్శములు, ఉన్నతాభిప్రాయములును కనుపడినను అట్టివన్నియు కమ్యూనిజమని, ప్రభుత్వమువారు అట్టియున్నతపురుషుల నత్యంతముగా హింసించుచుండిరి. వార్తాపత్రికలపై హెచ్చుగా నిర్బంధకలుగజేసి, కొన్ని వార్తలను ప్రకటింపబడకుండ జేయుచుండిరి. హిట్లరు మసోలినీ యొక్క జీవితములు ప్రభుత్వమువారి యాజమాన్యము క్రింద తర్జుమాకాబడి, యాపుస్తకములు ప్రభుత్వోద్యోగియులకు పంచిపెట్టబడినవి. పుస్తకములు, నాటకములు, సినీమాలు, ప్రదర్శనములు—వీనివలన యేమాత్రము కమ్యూనిస్టు వాసనలు ప్రజలకుసోకునని యనుమానపడినను, యట్టివన్నియు మాపుచేయబడినవి. కాని కమ్యూనిస్టులు, యీ నాంకింగు ప్రభుత్వము క్రింద యున్న దేశములలోకూడ, వారి ప్రచారము పూర్తిగ సాగింప మొదలిడిరి. చైనాదేశములోని ప్రజలెల్లరును జపానుదేశము క్రమముగా దేశమంతయును యాక్రమించుకొను పెండమాత్ర మెదుర్కొని యట్టియాక్రమణను, నిరోధించి, దేశము స్వతంత్రత నిజముగా గల్గియుండవలెనను యొక్క యాశయమునకై యెల్లరును కలసి, సామ్రాజ్య తత్వము యొక్క దండయాత్ర నెదుర్కొనవలెనని, కమ్యూనిస్టులు దేశమందంతటను చాటిరి. కొమింటాంగు పార్టీని గూడ యీ నిరోధమునకు వప్పుకొనుమని వేడుకొనిరి. సామ్రాజ్య నిరోధమున కేర్పడిన యైక్యత, చాలమందిజనుల యామోదము బడసెను. కర్షకులసంఘము సామ్రాజ్య నిరోధమునకై యైక్యతను కల్గించుటకు తీవ్రముగా పనిచేసినది. విద్యార్థుల సంఘము లీయైక్యతను బలపరచుటకై యత్యంత యుత్సాహముతో పనిచేసినవి. యీవిధముగ ప్రచారములో చాలమంది నిర్బంధితులైరి. యిట్టి ప్రచారము చాంకేషేకు ప్రభుత్వమువారు యణచివేసి ప్రచారకులను నిర్బంధించిరి. చాలమంది యుద్యమమందు ప్రాణములు గోలుపోయిరి. కాని 1936 లో యీయుద్యమముయొక్క తీవ్రతయే చాంకేషేకుయొక్క విధానమును పూర్తిగ మార్చివేసెను. యింతవరకు యున్న యక్రమముగ ప్రచారముపై యున్న నిర్బంధములను చాంకేషేకు కాలంరకు తీసివేయుటకు నిర్ణయించెను. యింతవరకు రాజకీయసంస్థలపైగల నిర్బంధములన్నియు తొలగించుటకు వప్పుకొనెను. యీమార్పు పూర్తిగ, చైనాపౌరుల వత్తిడివలనను, సామ్రాజ్యనిరోధనమున కేర్పడిన యైక్యతయొక్క గొప్ప శక్తివలననే కల్గినదనుటలో యేలాటిసందియము లేదు.

సంయుక్త ప్రతిఘటన

యిది యిట్లుండగా కమ్యూనిస్టు పార్టీవారు కొమింటాంగువారితో చేరి జపాను నెదుర్చుటకు తగు వసతులు కల్పింపమని కొమింటాంగుపార్టీ వారిని యడిగిరి. యీ పద్ధతికి చాలవరకు కొమింటాంగువారు 1937 ఫిబ్రవరిలో యొప్పుకొని యున్నారు. దీనివల్ల చైనా నూటికి 95 వంతులు జపానుకు వ్యతిరేకముగ, పూర్తి యైక్యత జెందియున్నది. యీసమయములో యిక యూరకొనిన, తమ సామ్రాజ్యాశయములు పూర్తిగ విఫలమగునట్టి సూచనలు చూచి, జపానుసామ్రాజ్యవాదులుభీతి చెందిరి. జర్మనీతో జపానువారు, కమ్యూనిజముతో పోరాడుటకు సంధి చేసికొనిరి. ఆవిధముగనే చైనాలోని నాంకింగుప్రభుత్వమువారు, తమతో కమ్యూనిజమును నిర్మూలించుటకై సంధి చేసికొనవలెనని జపాను విదేశ రాజ్యాంగ మంత్రి దెలియజేసెను. కాని చాంకేషేకు యభిప్రాయ మెట్లున్నను, సర్వజనాభిప్రాయముయొక్క యైక్యతకు వెరచి, యిట్టి సంధిని జేయుటకు, నాంకింగు ప్రభుత్వము యిష్టపడ లేదు. సామ్రాజ్యవాదులు, తమ పెట్టుబడిని వలసదేశములకంపి, లాభములు హెచ్చుగా సంపాదించవలయునిన యీ వలసదేశస్థులు, చాలవరకు స్వాతంత్ర్యేచ్ఛగలవారుగా యుండగూడదు. వారట్టివారుగ యున్నయెడల ఆ దేశస్థులు యజ్ఞానమువలన మోసగింపబడి, సామ్రాజ్యస్థులకు లాభమును నిరంతరమును చేకూర్చునట్టి పరిస్థితులుండవు. అందువలననే జపానువకు వ్యతిరేకముగా ప్రచారము హెచ్చుచుండ—యీప్రచారము దేశస్వాతంత్ర్యముకొరకును, దేశముయొక్క యార్థికాభివృద్ధికిని ముఖ్యమగునట్టియు, యనివార్యమగునట్టియు యావసరమైయుండ—జపాను సామ్రాజ్యవాదుల నిరంతర లాభములను, తగ్గించును. యీప్రచారము వలన, జపానుసరుకులు విరివిగా చెల్లుబడికావు. కావున మనదేశమునగూడ విదేశవస్తువులు కొనగూడదను ప్రచారము నడుపువారు లాఠీదెబ్బలకు గుఱియైరి. అందువలన యీస్వతంత్రమును సంపాదించుటకై యేర్పడిన సామ్రాజ్యతత్వ వ్యతిరేకయుద్యమమును, యుద్ధముచేసి రూపుమాపి, చైనాదేశమును జపానుయొక్క వలసదేశముగా యొనర్పవలెనను యుద్దేశ్యమే, జపానును యుద్ధమునకు పురికొల్పినది. యిక యుద్ధముచేసి, తమ సామ్రాజ్య యాశయములు నెరవేర్చవలెనని నిశ్చయించిన వెనుక కారణములే దొరకకుండునా! ఇంగ్లీషువారికి తెల్లవారి బాధ్యతయే (White man's burden) హిందూదేశము నాక్రమించుటకు కారణమయ్యెను. నాగరికతను అబిసీనియాలో దిగుమతిచేయుటయే యిటలీ వారా దేశమాక్రమించుటకు కారణమయ్యెను. దేశ మరాచకములోయున్నదని కనికరించి, ప్రభుత్వమును నెలకొల్పవలెనను మహోద్దేశ్యముతోనే స్పెయినును యాక్రమింపబూనుటకు, యిటలీ, జర్మనీలకు కారణమయ్యెను. జపానువారికి, వారి సూత్రాల మండగములు రాక, కమ్యూనిజం ఎదుర్కొనుటకే చైనాపై దండెత్తుటకు కారణమాయెను.

ఇటులనే చైనాలోనున్న కమ్యూనిస్టు రాజ్యములపై గొన్ని సామ్రాజ్యదేశములు సహాయముచేసి, వారిపై దండయాత్రను కొనసాగించిరి. కమ్యూనిస్టులు కేవలము బందిపోటులుగుంపులని పత్రికలలో ప్రచారముచల్పిరి. కమ్యూనిస్టుల యునికిపట్లెల్లను పట్టుబడెననియు, పత్రికలలో ప్రకటింపబడెను. కాని తిరిగి కమ్యూనిస్టు రాజ్యములు యేర్పడుటయు, వానిబలము హెచ్చుటయు వ్యక్తమగుచుండుటచే, యీ కమ్యూనిస్టు యునికిపల్లెలను పట్టుబడెనను వార్తయొక్క యసత్యత వ్యక్తమగుచుండెను. కాని యిప్పుడు కమ్యూనిస్టులు వారి సేనలను పూర్తిగ జపానుయొక్క దండయాత్రను నిరోధించుటలో చైనాలోని యితరప్రజలతో కలసి, యీసామ్రాజ్యవాదుల దుండగములనణచివేసి, సామ్రాజ్యతత్వము చైనాలో నుండి బైటకు తరిమి వేయు నెంచుటకై చేయుచున్న గొప్ప మహోత్తర పరిశ్రమములో, లోకములోనియున్నతాదర్శములుగలపురుషుల సానుభూతి వారియందే యున్నది. స్టాలిను, స్పెయిను విషయములో చెప్పినటుల, చైనాలోని సామ్రాజ్యవాదుల దండయాత్ర నెదుర్కొని, సామ్రాజ్యతత్వమును నిర్మూలించుట, చైనాదేశమువారి స్వంతపనిమాత్రమే గాదు, యీపని లోకములో యున్న మహోదర్శములుగల ప్రతిమానవునియొక్కయు, సామ్రాజ్యత్వముయొక్క గొప్పబంధనములచే కృంగిపోవునట్టియు, సామ్రాజ్యదేశమున బానిసత్వముక్రింద నున్న ప్రతిదేశ మానవునియొక్కయు ముఖ్యకర్తవ్యము. చైనాలో జపానుసామ్రాజ్యవాదులకు తగువిధముగ ప్రాయశ్చిత్త మొనర్చి వారిని బారదోలినచో చైనావారు తమకేగాక ఆసియాఖండములో సామ్రాజ్యతత్వ నిర్మూలనకు పోరాడు ప్రతివారికిని, గొప్పదైనట్టి మేలును చేసినవారగుదురు అట్టి పోరాటమునకును, దానియొక్క విజయమునకును మార్గదర్శకులయ్యెదరు. అందువలననే మనదేశములోని సామ్రాజ్యవిరోధులు, చైనావారుసాగించుస్వాతంత్ర్యయుద్ధమునకు, సానుభూతిజూపి, సహాయము చేయవలెను.

అమృతాంజనం

★

మీ రక్తమును విషపూరితము కానీయకుడు



వీటో

★

అన్ని చోట్ల ఏజంట్లు కావలెను.

చర్మము మీదచిన్న పగులున్ననూ—అది చాల ప్రమాదకరమైనది. విషక్రిములు శరీరమునందు ప్రవేశించి రక్తమును విషపూరితము చేయగలవు. రక్తప్రసరణ నుండల నంతయు విషక్రిములతో నిండి ఆరోగ్యము ధ్వంసమగును. క్రిమి సంహారకమైన వీటో రాసినంతనే చర్మములో లీనమై విషక్రిములను నాశనము చేసి, రక్తమును విషపూరితము కాకుండ కాపాడును.

మీ శరీరముమీద ఎచటనైనను కోతగాని, పగులుగాని, వ్రణముగాని యున్నచో వీటోవాడుడు. చర్మవ్యాధులకు వీటో సాటిలేని మందు.

వీటో ప్రతిచోట దొరకును.

ఒక అణా బిళ్ల పంపువారికి శాంపిల్ ఉచితముగా పంపబడును.

ఏజంటులు:

వీటో మాన్యుఫేక్చరింగ్ కంపెనీ, రాజమండ్రీ.



సోషలిజాన్ని గూర్చి

తెలుసుకోవాలంటే 'విశ్వసాహిత్యమాల'

పుస్తకాలు చదవండి.

సోషలిజం ఎందుకు?	1—0—0
నా రష్యాయాత్ర	0—8—0
సోషలిజము కమ్యూనిజం	0—6—0
సామ్యవాదం.	0—6—0

వివరాలకు వ్రాయండి. తెలుగులో ఏ రాజకీయ గ్రంథం కావలసినా....

విశ్వసాహిత్యమాల

ముంగండ (via) అంబాజీపేట.

★ నవశక్తి. ★

సంవత్సర చందా	3—0—0
అర్ధ సంవత్సరం	1—10—0
విడి ప్రతి	అణా.

మేనేజర్, నవశక్తి—రాజమండ్రి

కొక్కోకము

స్త్రీపురుషరహస్యములు 64 చిత్రపటములతో 232 పేజీలుగల పెద్దపుస్తకము. ధర రూ. 1-0-0 పోష్టు ఖర్చులు అ. 5. ఇందులో స్త్రీపురుష శృంగార రహస్యములు, శయ్యాగృహ మర్మములు గలవు.

ముద్దుల మర్మములు

పక్షకటింటి ముచ్చటలు, రతి సంబంధమైన అనేక మర్మవిషయము లిందుగలవు. 8 పటములతో 148 పేజీలుగల పెద్దపుస్తకము. ధర రూ. 0-8-0. పోష్టు ఖర్చులు 5 అణాలు. కొక్కోకము ముద్దులమర్మములు ఓదఫా రెండుకొనిన పోష్టుఖర్చులు ఇనాం.రు. 1-12-0 మాత్రము.

చేతిపనుల వర్తకరహస్యబోధిని

సబ్బులు, సెంటులు, పరిమళ తైలములు, బాణసంచా అత్తరు, పన్నీరు, పిప్పరమెంటు మందులు మొదలగునవి సులభముగా తయారుచేయు పరిశ్రమలు 400 గల 200 పేజీలుగల పెద్దపుస్తకము. ధర 1 రూపాయి. పోష్టుపా ఖర్చులు 5 అలు.

మహారాజ పుస్తకశాల,

అరుణాచల మొదలివీధి, 18 వీటు మదరాసు.

మంచిబియ్యమే మీ ఆరోగ్యకారణము

మేము సుమారు 5 సంవత్సరములనుండి మంచిరకముల పాత ధాన్యము పంపించి స్వల్ప లాభమునకు విక్రయించు చున్నాము. మా యొద్ద నిత్యము వెన్నలవంటి దాండు బియ్యము తయారు చేయుచుందురు. ఆరోగ్యవంతులుగ నుండదలచిన దంపుడు బియ్యమును వాడవలెనన్న సంగతి యెల్లరకు తెలిసినదే. ఒకసారి మాదంపుడు శాలకు దయచేసి, మా బియ్యమును వాడిచూచిన నమ్మకమైనట్టియు శ్రేష్ఠమైనట్టియు దంపుడుబియ్యమని తమకేవిశదమగును. మాటలతో మోసపుచ్చుట మా మతము కాదు.

అభిప్రాయము!

భ. సూర్యనారాయణమూర్తి. దంపుడుబియ్యము వ్యాపారస్తులు. చాలకాలం వారి బియ్యము నేను వాడితిని. చాల బాగున్నవి.

(సం) మీనాక్షిసుందరమ్

మ్యునిసిపల్ హెల్త్ ఆఫీసర్, రాజమండ్రి

భమిడిపాటి సూర్యనారాయణమూర్తి అండ్, బ్రదర్స్.

దంపుడుబియ్యం వ్యాపారస్థులు

రంగాచారి రోడ్డు, ఇన్నీసుపేట

రాజమండ్రి.

Printed by V. Suryanarayana Sastry at Srinivasa Press } Rajahmundry.

END OF VOLUME